SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్
D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక

వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : మంగళవారం 15 సెప్టెంబర్ 2020 ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం VAARTAVALI TELUGU DAILY పేజీలు : 8 రూ. 1.00 సంపుటి 5 సంచిక 206

## వైసిపి ఎంపీలతో సీఎం భేటీ



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్ట్‌ల సాధనపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులతో పాటు పోలవరం ప్రాజెక్ట్‌కు నిధుల సాధన అజెండాగా సమావేశం సాగింది. అన్ని ఫార్మాట్ల అవకాశాలను పార్లమెంట్‌లో వినియోగించుకునేలా ఎంపీలకు సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు.

ఇప్పటికే బీఏసీ సమావేశంలో ఏపీకి సంబంధించిన కరోనా నియంత్రణ చర్యలు, రాష్ట్రాలకు రావాల్సిన జీఎస్టీ నిధుల వంటి అంశాలపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి స్పీకర్‌ను కోరిన సంగతి తెలిసిందే.

## 19 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** 'తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆదాయ, వ్యయాలను ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆడిట్ చేసేవారు. ఇకపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)తో ఆడిటింగ్ చేయించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది' అని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అలాగే ఈనెల 19 నుంచి 27 వరకు జరగనున్న తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను కరోనా నేపథ్యంలో ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో భక్తులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన వివరాలు..పారదర్శకత పెంచడంలో భాగంగా ఆగస్టులో బోర్డు సమావేశాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశాం. పెరటాసి మాసం కారణంగా భక్తుల రద్దీ పెరగడంతో తిరుపతిలో రోజుకు 3 వేల చొప్పున ఆఫ్‌లైన్‌లో జారీ చేస్తున్న సర్వ దర్శనం టైంస్లాట్ టోకెన్లను 30 వరకు తాత్కాలికంగా నిలిపివేశాం. ఆన్‌లైన్ కోటా పెంచి రోజుకు 13 వేల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు జారీ చేస్తున్నాం. నిధుల కోసమే టీటీడీ ఇలా చేస్తోందన్న ప్రచారంలో వాస్తవం లేదు. ఆన్‌లైన్ కల్యాణోత్సవంలో పాల్గొనే వారు టికెట్ బుక్ చేసుకున్న తేదీ నుంచి 90 రోజుల్లోపు శ్రీవారిని దర్శించుకోవచ్చు. కరోనా వల్ల శ్రీవారి ఆర్జిత సేవలను రద్దు చేయడంతో.. ఇప్పటికే ఉదయాస్తమాన సేవ, వింశతి వర్ష దర్శిని పథకాల టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు ప్రోటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తాం.

**దళారుల మాటలకు మోసపోవద్దు: టీటీడీ**

తిరుమలలో ఆర్జిత సేవా టికెట్లు ఇప్పిస్తామని కొందరు దళారులు భక్తులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని టీటీడీ నిఘా, భద్రతా విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కరోనా నేపథ్యంలో తిరుమలలో ప్రస్తుతం ఎలాంటి ఆర్జిత సేవా టికెట్లు ఇవ్వడం లేదని పేర్కొంది. తిరుమలకు సంబంధించిన సేవా టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ అయిన 'తిరుపతిబాలాజీ. ఏపీ.జీవోవీ. ఇన్'లో మాత్రమే పొందే అవకాశముందని స్పష్టం చేసింది. ఆర్జిత సేవల పునరుద్ధరణ తర్వాత ఆన్‌లైన్‌లో సేవా టికెట్లు లభించని భక్తులకు తిరుమలలో లక్కీ డిప్ ద్వారా టికెట్లు పొందవచ్చని పేర్కొంది. భక్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేసింది.



## ఏపీ ప్రభుత్వానికి సుప్రీం గ్రీన్‌సిగ్నల్

### ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ :** పదిమంది కరోనా బాధితుల మృతికి కారణమైన విజయవాడ రమేష్ ఆస్పత్రిపై చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్వర్ణ ప్యాలెస్ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రమాద కారకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తుపై ఏకపక్షంగా నిషేధం విధించడం సరికాదన్నారు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల 10 మంది కరోనా పేషెంట్లు చనిపోయారని వివరించారు. రమేష్ ఆస్పత్రి యాజమాన్యం దర్యాప్తునకు సహకరించడం లేదని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు సాగే విధంగా హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని న్యాయవాది వాదించారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం.. ఏపీ ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డాక్టర్ రమేష్ కేసులో విచారణ జరపొచ్చని తెలిపింది. దర్యాప్తునకు డా.రమేష్ పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. అయితే రమేష్ అరెస్ట్‌పై సాక్ష్యాల ఆధారంగా హైకోర్టు నిర్ణయం తీసుకోవచ్చిన ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా రమేష్ ఆస్పత్రి యజమాని డాక్టర్ రమేష్ ప్రమాదం జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్న సంగతి తెలిసిందే. హైకోర్టు ఆయనకు, మరో డైరెక్టర్ సీతా రామ్మోహన్ రావులను అరెస్టు చేయకుండా స్టే ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ గత గురువారం ఏపీ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తాజా సుప్రీంకోర్టు నిర్ణయంతో ఏపీ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. దోషులను కోర్టు నిలబెట్టే విధంగా విచారణ జరుపనున్నారు.

## ఫిబ్రవరికల్లా రథం నిర్మాణం పూర్తి

### వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 14 :** వచ్చే ఫిబ్రవరిలో అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయి. అప్పటిలోగా అందరి అభిప్రాయాల మేరకు.. ఆకృతిలో ఎటువంటి మార్పులు లేకుండా రథాన్ని సిద్ధం చేయాలని అధికారులను అదేశించిన్నట్లు దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం బ్రాహ్మణ వీధి దేవదాయ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ పి.అర్జునరావుతో మంత్రి వెలంపల్లి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొత్త రథం నిర్మాణానికి ఆకృతి సిద్ధమైందన్నారు. రథం నిర్మాణంపై చర్చించి ఆకృతిని తయారు చేయించామన్నారు. కొత్త రథాన్ని శిఖరంతో కలిపి 41 అడుగుల ఎత్తు వచ్చేలా ఆకృతి రూపొందించామన్నారు. ఆరు చక్రాలతో కూడిన రథం మొత్తాన్ని ఏడు అంతస్తులుగా రూపొందిస్తున్నమని వెలంపల్లి తెలిపారు. కొత్త రథం నిర్మాణంతో పాటు.. రథశాల మరమ్మతుల నిమిత్తం 95 లక్షల రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఈ మేరకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందన్నారు మంత్రి వెలంపల్లి. సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ పి.అర్జునరావు, ఎస్ఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బాబు మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారు: రోజా



**తిరుపతి:** అంతర్వేది ఘటనలో నిజాలు నిగ్గు తేలాలి అని నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా డిమాండ్ చేశారు. అందుకే దీనిపై సీబీఐ విచారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. చంద్రబాబులా పిరికిపంద రాజకీయాలు సీఎం జగన్‌కు తెలియవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. 'చంద్రబాబు గతంలో రాష్ట్రానికి సీబీఐ అవసరం లేదన్నారు. టీడీపీ పాలనలో 40 ఆలయాలను కూల్చివేశారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు 29 మందిని పొట్టన పెట్టుకున్నారు. బాబు హయాంలో దుర్గగుడి, శ్రీకాళహస్తి ఆలయాల్లో క్షుద్రపూజలు జరిగాయి. చంద్రబాబు పాలనలో తిరుమలలో వేయి కాళ్ల మండపం కూల్చేశారు. కానీ ఎన్నడూ చంద్రబాబు సీబీఐ విచారణ కోరలేదు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు చంద్రబాబు కుట్ర పన్నారు' అంటూ రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## ఎంపీలు రెడ్డప్ప, మాధవిలకు పాజిటివ్



**న్యూఢిల్లీ :** చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డప్ప కరోనా వైరస్ బారినపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన ఎంపీకి పార్లమెంట్ సచివాలయంలో నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది. ఎటువంటి లక్షణాలు లేకుండానే కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఐసోలేషన్‌లో ఉండాలని అధికారులు సూచించారు. అరకు ఎంపీ మాధవికి కూడా కరోనా సోకింది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఎంపీ.. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో రెండు వారాల పాటు ఢిల్లీలోనే చికిత్స తీసుకోనున్నారు. కాకినాడ ఎంపీ వంగ గీతా సైతం ఇదివరకే వైరస్ బారినపడిన విషయం తెలిసిందే. గత శనివారం ఆమెకు నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది. కాగా దేశంలో కరోనా వైరస్ విజృంభణ కారణంగానే ప్రత్యేక పరిస్థితుల నడుమ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. మరోవైపు దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు 24 మంది ఎంపీలకు, 8 మంది కేంద్రమంత్రులకు కరోనా పాజిటవ్‌గా తేలింది. ఇక స్వల్ప లక్షణాలు ఉన్నా.. సభలోకి అనుమతి లేదని స్పీకర్ ఇదివరకే ప్రకటించారు.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను. యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను. bulusu333@gmail.com మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు. 8500159006 నెంబరుకు సంప్రదించగలరు
YouTube

విలేకరులు కావలెను
'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
7032034001, 8500159006



## రూ.1 కట్టినంత మాత్రాన తీర్పు అంగీకరించినట్లు కాదు

**ఢిల్లీ:** కోర్టు ధిక్కరణ కేసులో సుప్రీం కోర్టు విధించిన జరిమానాను కట్టినంత మాత్రాన తాను న్యాయస్థానం తీర్పును అంగీకరించినట్లు కాదని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. కోర్టు విధించిన రూపాయి జరిమానాను కోర్టు రిజిస్టరీకి సోమవారం ఆయన చెల్లించారు. అలాగే కోర్టు ధిక్కరణ అంశంపై రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జరిమానాను చెల్లించేందుకు కోర్టు ఆవరణకు చేరుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టుకు జరిమానా చెల్లించేందుకు తనకు దేశం నలుమూలల నుంచి నాణేలు వచ్చాయని చెప్పారు. అలా వచ్చిన మొత్తాన్ని 'సత్య నిధి' పేరిట ఉంచుతామని చెప్పారు. తనలా భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసి ప్రాసిక్యూషన్ ఎదుర్కొనే వారికి న్యాయ సాయంగా ఈ మొత్తాన్ని వినియోగిస్తామని చెప్పారు. అలాగే, ఢిల్లీ అల్లర్లలో పాత్ర ఉందన్న ఆరోపణలతో జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్‌ను అరెస్ట్ చేయడంపైనా ప్రశాంత్ భూషణ్ మాట్లాడారు. విమర్శలను అణచివేసేందుకు కేంద్ర అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.

# జాతీయం- అంతర్జాతీయం

## 24 గంటల్లో 92,071 కేసులు.. 1,136 మరణాలు



**దిల్లీ:** భారత్‌లో కరోనా ఉద్ధృతి కొనసాగుతూనే ఉంది. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా 9,78,500 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 92,071 కేసులు కొత్తగా వెలుగులోకి వచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం కేసుల సంఖ్య 48,46,428కి చేరింది. వీరిలో 9,86,598 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. 37,80,107 మంది కోలుకొని ఇళ్లకు చేరుకున్నారు. ఇక కొత్తగా 1,136 మంది మహమ్మారికి బలయ్యారు. దీంతో ఇప్పటి వరకు కరోనా బారిన పడి మరణించిన వారి సంఖ్య 79,722కి పెరిగింది. ఇక దేశవ్యాప్తంగా రికవరీ రేటు 78 శాతానికి చేరింది. మరణాల రేటు 1.64 శాతంగా ఉంది. ఇక ప్రపంచవ్యాప్తంగా జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయం లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 28,902,170 కేసులు నమోదయ్యాయి. వీరిలో 9,22,735 మంది మృత్యువాతపడ్డారు. 65,19,554 కేసులు, 1,94,073 మరణాలతో అమెరికా తొలిస్థానంలో ఉండగా.. భారత్, బ్రెజిల్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## కరోనా సోకిన కణాల తీరు ఇదీ..

### ఫొటోలు తీసిన శాస్త్రవేత్తలు



**వాషింగ్టన్:** శ్వాసకోశ వ్యవస్థలో కరోనాతో కలిగే ఇన్‌ఫెక్షన్ తీరును సచిత్రంగా అమెరికా శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ల్యాబ్‌లో వృద్ధి చేసిన శ్వాస కోశ కణాల్లో ఈ వైరస్ విజృంభణకు సంబంధించిన చిత్రాలను క్లిక్‌మనిపించారు. ఊపిరితిత్తుల్లోని ఒక్కో కణంలో ఎన్ని వైరస్ రేణువులు ఉత్పత్తవుతాయన్నది కూడా వారు ఆవిష్కరించారు. ఉత్తర కరోలైనా విశ్వవిద్యాలయంలోని చిన్నారుల పరిశోధన సంస్థకు చెందిన క్యామిలె ఎహ్రె నేతృత్వంలోని శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. శ్వాస నాళాల్లో కరోనా ఇన్‌ఫెక్షన్ తీవ్రతను ఈ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి. శాస్త్రవేత్తలు ఊపిరితిత్తుల్లోని మానవ బ్రాంకియల్ ఎపిథీలియల్ కణాలను కరోనా వైరస్‌కు శాస్త్రవేత్తలు గురిచేశారు. 96 గంటల తర్వాత శక్తిమంతమైన స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపు సాయంతో వీటిని పరిశీలించారు. అక్కడ ఉత్పత్తయిన వైరస్ నిర్మాణం, సాంద్రతను విశ్లేషించారు. ఇవి పూర్తిగా సాంక్రమిక రూపంలో ఉన్నాయని తేల్చారు. ఒక్కో కణంలో ఉత్పత్తవుతున్న వైరస్‌ల సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. వైరల్ లోడు అధికంగా ఉండటం వల్ల ఆ సూక్ష్మక్రిములు ఇతర అవయవాలకు, వ్యక్తులకు సంక్రమిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి ఇన్‌ఫెక్షన్ సోకిన వారు, సోకని వారు తప్పనిసరిగా మాస్కులను ధరించాలని సూచించారు.

## భారత సైన్యంపై తప్పుడు ప్రచారం!



భారత్, చైనా ఉద్రిక్తతల నేపథ్యంలో వేల సంఖ్యలో భారతీయ సైనికులు సైనికులు సిక్‌లీవులపై వెళుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. "లద్దాఖ్ వద్ద భారత-చైనా ఘర్షణలు, వాస్తవాధీన రేఖ వద్ద కాల్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో.. 45 సంవత్సరాల్లో తొలిసారిగా 80,000 మందికి పైగా భారత సైనికులు సిక్‌లీవులకు దరఖాస్తు చేసుకున్నారు" అంటూ వార్తలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే, ఇవన్నీ అసత్యాలని ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పష్టం చేసింది. ఈ కారణంగా భారతీయ సైనికులు ఎవరూ సెలవుకు దరఖాస్తు చేయలేదని సైనిక వర్గాలు కూడా స్పష్టం చేశాయి. ఈ విధమైన వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. భారతీయ భద్రతాదళ అధికారులు స్పష్టం చేశారు.లద్దాఖ్ ప్రాంతంలోని భారత్-చైనా సరిహద్దుల వద్ద గల్వాన్ లోయలో.. జూన్‌లో జరిగిన వివాదంలో 20 మంది భారతీయ సైనికులు అమరులవటం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ఘటనలో భారీ సంఖ్యలో చైనా భద్రతాదళ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయినట్టు తెలిసింది. అంతేకాకుండా, ఇటీవల భారత్, చైనా సైన్యాల మధ్య ఇటీవల గాల్లోకి కాల్పుల సంఘటన చోటుచేసుకోవటంతో సరిహద్దుల వద్ద పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

## టీకా ప్రయోగం స్వీకరించేందుకు సిద్ధం



**దిల్లీ:** కరోనా వైరస్‌కు టీకా 2021 మొదటి త్రైమాసికం లోగా వస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా ఆదివారం నిర్వహించిన 'సండే సంవాద్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'కొవిడ్19 టీకా 2021 మొదటి త్రైమాసికం లోగా టీకా అందుబాటులోకి వస్తుంది. ప్రజల్లో టీకాపై నమ్మకం కలిగించేందుకు.. దాని ప్రయోగం కోసం వాలంటీర్‌గా వ్యవహరించడానికి సిద్ధంగా ఉన్నా. టీకా విడుదలైన వెంటనే మొదట ఆరోగ్య కార్యకర్తలు, వృద్ధులకు అందుబాటులోకి తెస్తాం. వారితో పాటు అత్యవసరం ఉన్న అందరికీ ఖర్చుతో సంబంధం లేకుండా పంపిణీ చేస్తాం. వ్యాక్సిన్ భద్రత, ధర, ఈక్విటీ, ఉత్పత్తి సహా పలు అంశాలపై తీవ్రంగా చర్చిస్తున్నాం'అని హర్షవర్ధన్ తెలిపారు. అదేవిధంగా మార్కెట్లో రెమిడెసివిర్ వంటి మందుల విషయంలో అక్రమ దందా జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయని... వాటిపై చర్యలు తీసుకోవాలని ఔషధ నియంత్రణ మండలికి సూచించినట్లు వెల్లడించారు. భారత్‌లో గడిచిన 24 గంటల్లో 94వేల రికార్డు స్థాయి కరోనా కేసులు నమోదైన విషయం తెలిసిందే. తాజా వాటితో కలిపి దేశంలో కేసుల సంఖ్య 47లక్షలకు పైగా చేరింది. కాగా 1,114 మంది మరణించారు. ప్రస్తుతం దేశంలో 37లక్షల మంది వైరస్ బారి నుండి కోలుకున్నారు.

## అమెరికాలో తెలుగు యువతి దుర్మరణం

### జలపాతంలో జారి పడి మృతి



**గుడ్లవల్లేరు,** అమెరికాలోని ఓ జలపాతంలో ప్రమాదవశాత్తు పడి కృష్ణా జిల్లా యువతి ఒకరు దుర్మరణం చెందారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన పోలవరపు లక్ష్మణరావు, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె కమల (26) గుడ్లవల్లేరులో ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికా వెళ్లారు. ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం కొలంబియాలో ఉంటున్నారు. శనివారం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగొస్తూ అట్లాంటా సమీపంలోని జలపాతంవద్ద ఆగారు. అక్కడ సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ జలపాతంలో పడి మృతి చెందారు. నాట్స్ సహకారంతో ఆమె మృతదేహాన్ని భారత్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## ముంబయి దేశవాసులందరిదీ: కేంద్రమంత్రి



**ముంబయి:** వాట్సాప్‌లో ఫొటోలను ఫార్వర్డ్ చేయడం తప్పేం కాదని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. ఇటీవల ముంబయిలో శివసేన కార్యకర్తల చేతిలో దాడికి గురైన నేవీ మాజీ అధికారి మదన్ శర్మను ఆదివారం ఆయన పరామర్శించారు. ముంబయిలోని బాధితుడి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. 'భాజపా ముఖ్యమంత్రి వద్దంటూ ప్రభుత్వ ఏర్పాటు కోసం సంజయ్ రౌత్ వెళ్లి సోనియా, పవార్‌లను మద్దతు అడిగారు. అలా వారి సాయంతోనే మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దానికి సంబంధించిన ఫొటోనే మదన్ శర్మ షేర్ చేశారు. ఆ ఫొటో భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు విరుద్ధంగా ఉందని సంజయ్ రౌత్ అనడం సరికాదు. ఫొటోలు ఫార్వర్డ్ చేయడం తప్పేం కాదు' అని అథవాలే ఆరోపించారు. 'ముంబయి మహారాష్ట్రవాసులదే అని శివసేన 'సామ్నా' వేదికగా చెప్పడాన్ని నేను ఒప్పుకుంటున్నా. కానీ దేశంలో వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ ఎవరు నివసించినా వారు ముంబయి వాసులే అవుతారు. కాబట్టి ముంబయి మహారాష్ట్రవాసులతో పాటు దేశ ప్రజలందరిదీ కూడా' అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు ఈ దాడి ఘటనపై బాధితుడు మదన్‌శర్మ మాట్లాడుతూ.. 'నేను పోస్ట్ చేసిన ఫొటో.. చిత్రకారుడు ఉదయ్ మహేశ్వరీ గీశారు. నాకు నచ్చింది కాబట్టి నేను ఫార్వర్డ్ చేశాను. ఎవరికైనా సమస్యగా ఉంటే వెళ్లి గీసిన వారిని అడగాలి. కానీ నాపై దాడి చేస్తే ఏమిటి ప్రయోజనం. ఈ ఘటనకు బాధ్యతగా ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వెంటనే రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేను ఎగతాళి చేసే విధంగా ఉన్న ఫొటోను వాట్సాప్‌లో పంపినందుకు నేవీ మాజీ అధికారి మదన్ శర్మపై శివసేన కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే.

## భారత్‌లో కరోనా తీవ్రత అధికం:డబ్ల్యూహెచ్ఓ

### వెల్లడించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

**జెనీవా:** ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ రోజురోజుకూ ఉగ్రరూపం దాల్చుతోంది. గడిచిన 24 గంటల్లో 3,07,930 కేసులు నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడం వైరస్ విజృంభణకు నిదర్శనం. ఈ వివరాలన్నీ సంస్థ వెబ్‌సైట్‌లో ప్రచురితమయ్యాయి. భారత్, యూఎస్, బ్రెజిల్‌లో



ఈ కేసుల తీవ్రత అధికంగా ఉందని పేర్కొంది. కాగా, వైరస్‌తో ఆదివారం ఒక్కరోజే 5,537 మరణాలు చోటుచేసుకున్నాయని, మొత్తం మృతుల సంఖ్య 9,17,417కి చేరిందని వెల్లడించింది. కరోనా విజృంభణతో భారత్‌లో నిత్యం 90 వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. యూఎస్, బ్రెజిల్‌లో నిత్యం 40 వేల పైచిలుకు మంది వైరస్ బారిన పడుతున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా అర్జెంటీనా, ఇండోనేషియా, మొరాకొ, స్పెయిన్, ఉక్రెయిన్ వంటి 58 దేశాల్లో వైరస్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయని రాయిటర్స్ విశ్లేషించింది. కాగా, భారత్ వైరస్‌తో ఉక్కిరి బిక్కిరి అవుతుంటే..కొన్ని ప్రాంతాల్లో చికిత్సకు కావాల్సిన ఆక్సిజన్ కొరత ఏర్పడటం ఆందోళన కలిగించే పరిణామం.

## కరెన్సీ నోట్లు, కలర్ పెన్సిల్స్‌తో బోధన



**ముంబై:** కరోనా కారణంగా ఈ ఏడాది విద్యా సంవత్సరానికి తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ నెల ఆరంభం నుంచి పలు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. కానీ నేటికి కూడా గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ వంటి అంశాలు చాలా ఖరీదుతో కూడుకున్నవి. ఈ క్రమంలో ఓ పాఠశాల ఉపాధ్యాయుడు తన విద్యార్థుల కోసం ఓ వినూత్న ఆలోచన చేశాడు. కలర్ పెన్సిల్, కరెన్సీ నోట్ల జీరాక్సులతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడు. ఆ వివరాలు. ప్రల్హాద్ కాథోల్ పాల్ఘర్‌లోని బలివాలిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అసిస్టెంట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. మూడు, నాల్గవ తరగతి పిల్లలకు గణితం బోధిస్తాడు. అయితే లాక్‌డౌన్ కారణంగా పాఠశాలలు మూతపడిన సంగతి తెలిసిందే. అయితే ఆన్‌లైన్ క్లాస్‌లు బోధిద్దామంటే.. తన తరగతిలోని 44 మంది విద్యార్థుల్లో కేవలం 2 దగ్గర మాత్రమే స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ ఉంది. దాంతో ప్రల్హాద్ ఓ వినూత్న ఆలోచన చేశాడు. కొన్ని కరెన్సీ నోట్లను జీరాక్స్ తీపించి... వాటిని విద్యార్థులకు పంచిపెట్టాడు ప్రల్హాద్. మరి కొందరికి రంగు పెన్సిల్స్ పంచాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. 'నా విద్యార్థులు పాఠశాలను మరిచిపోకుడదని భావించాను. అందుకు ఒక వర్క్ షీట్ మీద కొన్ని లెక్కలు వేసి.. కరెన్సీ నోట్ల జీరాక్స్‌లు ఇచ్చి వాటిని పరిష్కరించాల్సిందిగా చెప్పాను. ఇలా చేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదవులో భాగం పంచుకుంటారు. అలానే నేను ప్రతి వారం ఒక గ్రామానికి వెళ్లి నా విద్యార్థులను కలుసుకుని వారి వర్క్‌షీట్లను పరిశీలిస్తాను. అర్థం కాని సమస్యలను బోధిస్తాను. వారికి కథలు చెప్తాను. కలిసి ఆడుకుంటాం. భోజనం చేస్తాము. తిరిగి పాఠశాలలు తెరిచే వరకు ఇదే పద్దతి కొనసాగిస్తాను' అన్నాడు ప్రల్హాద్.

## రూ. 60 లక్షలు పలికిన లింకన్ వెంట్రుకలు

**న్యూయార్క్ :** అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్‌కు చెందిన కొన్ని వెంట్రుకలు, రక్తపు మరకల టెలిగ్రామ్ వేలం వేశారు. శనివారం జరిగిన వేలం పాటలో వాటిని 81వేల డాలర్ల( 60 లక్షల రూపాయలు)కు సొంతం చేసుకున్నాడు ఓ వ్యక్తి. ఆర్ఆర్ ఆక్షన్ ఆఫ్ బోస్టన్ అనే సంస్థ ఈ వేలం పాటను నిర్వహించింది. జాన్ లిక్స్ బూత్ చేతిలో కాల్చి చంపబడిన తర్వాత లింకన్‌కు పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తున్నపుడు ఐదు సెంటీమీటర్ల పొడవుతో కొన్ని వెంట్రుకలు కత్తిరించి భద్రపరిచారు వైద్యులు. అనంతరం వాటిని 1865, ఏప్రిల్‌లో ఓ టెలిగ్రామ్ ద్వారా లింకన్ సహాయకుడికి పంపారు.

## మొబైల్ యాప్‌లో ఎంపీల సంతకం



**దిల్లీ:** కరోనా నేపథ్యంలో ఎంపీల సంతకాల కోసం పార్లమెంటు ఓ మొబైల్ యాప్‌ను రూపొందించింది. సంతకం చేసే సమయంలో సాధారణ హాజరు నమోదు పుస్తకంపై చేతులుపెట్టే అవకాశం ఉండటంతో వైరస్ సంక్రమణ ప్రమాదం ఉంటుందన్న ఉద్దేశంతో లోక్‌సభ సచివాలయం ఈ యాప్‌ను తయారుచేసింది. కేవలం పార్లమెంటు ప్రధాన భాగం(కోర్ ఏరియా)లో మాత్రమే పనిచేసేలా దీన్ని రూపొందించారు. సభ్యులు ఆ ప్రాంతంలో ఉంటేనే ఇందులో సంతకం చేయడానికి వీలవుతుంది. అలా కాకుండా చుట్టుపక్కల ఎక్కడున్నా అది సాధ్యం కాదు. దీంతోపాటు సాధారణ హాజరు నమోదు పుస్తకం కూడా అందుబాటులో ఉంచుతున్నామని, సభ్యులు ఈ రెండింటిలో దేన్నైనా ఉపయోగించుకోవచ్చని లోక్‌సభ సచివాలయం శనివారం రాత్రి జారీచేసిన బులిటెన్‌లో పేర్కొంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ల కోసం వేర్వేరుగా రూపొందించిన ఈ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకోవచ్చని తెలిపింది. మరోవైపు కొవిడ్ నేపథ్యంలో ఎంపీలకోసం ఈనెల 13, 14 తేదీల్లో రోజుకు గంటపాటు ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

**రాజ్యసభలో మీడియాకు అవకాశం**

కొవిడ్ నేపథ్యంలో మీడియా ప్రతినిధులకు అవకాశం కల్పించడం సంక్లిష్టమైనప్పటికీ రాజ్యసభ సచివాలయం మేలైన పద్ధతి అనుసరించనుంది. సభ జరిగే 18 రోజుల్లో 120 మీడియా సంస్థలకూ రొటేషన్ పద్ధతిలో మూడురోజులకోసారి సభా కార్యకలాపాలను కవర్ చేసే అవకాశం ఇచ్చింది. ఎవరికి ఏ రోజు అన్నది లాటరీ పద్ధతి ద్వారా నిర్ణయిస్తుంది. ఈ విధానాన్ని మీడియా స్వాగతించింది.

## దేశం మొత్తం సైన్యం వెంటే..: మోదీ

### పార్లమెంట్ ఆ సందేశం పంపుతుందని ప్రధాని ఆశాభావం



**దిల్లీ:** సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్, చైనా సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్త వాతారణం, దేశంలో కరోనావైరస్ విజృంభణపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మన సైనికులు మాతృభూమిని రక్షించుకోవడం కోసం, క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా సరిహద్దుల్లో ధైర్యంగా నిలబడి ఉన్నారు. అదే విధంగా వారికి అండగా నిలబడి ఉన్నామని పార్లమెంట్ కూడా సందేశాన్ని పంపుతుందని విశ్వసిస్తున్నాను' అంటూ మోదీ పేర్కొన్నారు. జూన్‌లో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్రస్థాయికి చేరడంతో భారత్, చైనా సైన్యాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ ఘటనలో మనదేశానికి చెందిన 20 మంది సైనికులు అమరులయ్యారు. ఈ నేపథ్యంలో జరగనున్న సమావేశాల్లో కేంద్రం పార్లమెంట్‌లో ప్రకటన చేయనున్నట్లు సమాచారం. దేశంలో కరోనా విలయ తాండవం చేస్తున్నప్పటికీ పార్లమెంట్ సభ్యులు విధులకు హాజరు కావడానికి, వారాంతాల్లో కూడా పనిచేయడానికి అంగీకరించడంపై మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే 'ప్రపంచంలో ఏమూలనుంచైనా వ్యాక్సిన్ త్వరగా అందుబాటులోకి రావాలని మేం కోరుకుంటున్నాం. మన శాస్త్రవేత్తలు కూడా విజయవంతం అవుతారు. ప్రజలను ఈ సమస్య నుంచి బయటకు తీసుకురావడంలో మేం కూడా విజయం సాధిస్తాం' అని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'కరోనా ల్యాబ్‌లోనే పుట్టింది'

### సాక్ష్యాలున్నాయంటున్న చైనా వైరాలజిస్ట్




ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ విషయంలో చైనా నిజాలు దాచిపెట్టిందని అదే దేశానికి చెందిన వైరాలజిస్టు డాక్టర్ లి మెగ్ యాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హాంగ్ కాంగ్‌లోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో పని చేస్తున్న ఆమె కరోనా వైరస్‌పై పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా ఆమె పలు విషయాలు వెల్లడించారు. ఈ మేరకు ఓ వీడియోను విడు దల చేశారు. 'నేను న్యుమోనియాపై పరిశోధనలు చేసే సమయంలోనే ఈ ప్రాణాంతక కరోనా వైరస్ వుహాన్‌లోని ఓ ల్యాబ్‌లో తయారైనట్లు గుర్తించాను. ఆ ల్యాబ్ పూర్తిగా చైనా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. వైరస్‌కు సంబంధించి నేను హెచ్చరికలు చేసినప్పటికీ ప్రపంచ ఆరోగ్య సంస్థ, చైనా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదకర మైన వైరస్ విషయంలో ప్రపంచాన్ని అప్రమ త్తం చేయాల్సింది పోయి నా హెచ్చరికలను సైతం నిర్లక్ష్యం చేశారు. ఈ వైరస్ ప్రకృతి నుంచి సహజసిద్ధంగా పుట్టింది కాదు. అది వుహాన్‌లోనే పుట్టిందనడానికి నా దగ్గర సాక్ష్యాలున్నాయి. వైరస్ విషయంలో గొంతు ఎత్తినందుకు నాపై చైనా అధికారులు బెదిరింపులకు పాల్పడ్డారు. చైనాలో నాపై దుష్ప్రచారం చేయడంతో పాటు నా సమాచారం మొత్తం డిలీట్ చేశారు. ఆ తర్వాత నేను అమెరికాకు వెళ్లిపోవాల్సి వచ్చింది' అని యాన్ ఈ వీడియోలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. వుహాన్‌లోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ యువాన్ జిమింగ్ మాత్రం ఆమె ఆరోపణలు కొట్టిపారేశారు. చైనా అధికారులు సైతం ఈ వీడియోపై ఇంత వరకూ స్పందించకపోవడం గమనార్హం.

## పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ రవికిషన్



**న్యూఢిల్లీ :** డ్రగ్స్ కేసుతో బాలీవుడ్‌కు ఉన్న సంబంధాలపై నటుడు, బీజేపీ ఎంపీ రవికిషన్( రేసుగుర్రం విలన్ మద్దాలి శివారెడ్డి) గళమెత్తారు. బాలీవుడ్‌లో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. దేశ యువతను నాశనం చేయటానికి కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. పొరుగుదేశాలు ఇందుకు సహకారం అందిస్తున్నాయన్నారు. సోమవారం నాటి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్, చైనాలనుంచి ప్రతి ఏటా మత్తు పదార్థాలు దేశంలోకి అక్రమంగా రవాణా అవుతున్నాయని, నేపాల్, పంజాబ్ ద్వారా దేశంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న కొంతమందిని అరెస్ట్ చేసి, ఎన్‌సీబీ మంచి పనిచేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, కేసుతో సంబంధం ఉన్న మిగిలిన దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలని కోరారు. పొరుగు దేశాల కుట్రకు శుభం కార్డు వేయాలన్నారు.




# డిగ్రీ లెక్చరర్ పోస్టులకు ఆన్ లైన్ పరీక్షలు

## నాలుగు కేంద్రాల్లో నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు బీ డి.ఆర్.ఓ. గణపతిరావు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకోసం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఆన్ లైన్ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో సెప్టెంబరు 15, 16 తేదీల్లో ఈ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణపై ఏ.పి.పి.ఎస్.సి. అధికారులు, పరీక్షా కేంద్రాల ఇన్ చార్జి అధికారులతో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 452 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలేవీ అనుమతించరని స్పష్టంచేశారు. పరీక్ష జరిగే రోజుల్లో ఉదయం జరిగే పరీక్షకు 8-00 నుండి 9-00 గంటల మధ్య అభ్యర్థులను లోనికి అనుమతిస్తారని, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.30 నుండి 2.30 గంటల మధ్య లోనికి అనుమతిస్తారని తెలిపారు. కోవిడ్ వ్యాధికి సంబంధించి తమ ఆరోగ్య పరిస్థితిపై అభ్యర్థులు సెల్ఫ్ డిక్లరేషన్ అందజేయాల్సి వుంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎం.వి.జి.ఆర్.ఇంజనీరింగ్ కళాశాల, లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, గాజులరేగలోని సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మేనేజ్మెంట్, బొబ్బిలి మండలం కలవరాయిలో వున్న స్వామి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా అభ్యర్థులంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు హాజరుకావలసి వుంటుందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఐసోలేషన్ గదులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద ఒక ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయం ఏ.ఓ. దేవీప్రసాద్ పాల్గొన్నారు.

# స్పందనకు 133 వినతులు



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** స్పందన కార్యక్రమానికి 133 వినతులు వచ్చాయి. కోవిడ్ దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించాల్సిన డయల్ యువర్ కలెక్టర్ మరియు స్పందన కార్యక్రమాలకు బదులుగా ఫోన్ ద్వారా తమ వినతులను తెలియజేసే స్పందన కార్యక్రమం జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఏర్పాటుచేసిన సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని స్పందన విభాగంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి నిర్వహించారు. వాటి వివరాలు ఇలా.. కొత్తూరు మండలం కలిగాం నుండి బి.అచ్యుతరావు ఫోన్ చేసి మాట్లాడుతూ తమకు చెందిన భూమి వివరాలు తహశీల్దార్ కార్యాలయంలో సక్రమంగానే ఉన్నాయని, కాని గ్రామ సచివాలంయలో తమకు ఎక్కువ భూమి ఉన్నట్లుగా నమోదు కావడంతో తమకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు అమలుకావడం లేదని, కావున దానిని సరిచేసి ప్రభుత్వ పథకాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు. గార మండలం శ్రీకూర్మం నుండి సింహాద్రి నాగమణి మాట్లాడుతూ వై.యస్.ఆర్. చేయూత పథకానికి తను దరఖాస్తు చేసుకున్నానని, అయితే తన వయస్సుకు బదులుగా తన కుమారుని వయస్సు నమోదుకావడంతో తనకు చేయూత పథకం మంజూరుకాలేదని, ప్రస్తుతం తన వయస్సు 47 సం.లు అని, కావున తాను అర్హురాలు అయినందున చేయూత పథకాన్ని మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ హెచ్. సెక్షన్ విభాగం పర్యవేక్షకులు అప్పారావు, స్పందన విభాగం భాస్కరరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా లెక్చరర్ పరీక్షలు

## స్పష్టం చేసిన జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** జిల్లాలో నేడు, రేపు జరగనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టుల నియామక పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టుల నియామక పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపిరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, ఉప తహశీల్దారులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ( ఏపి.పి.యస్.సి ) ప్రత్యేక అనుమతులు ఇచ్చిందని అన్నారు. సెప్టెంబర్ 15, 16 తేదీలలో రాజాంలోని జి.యం.ఆర్.ఐ.టి, ఎచ్చెర్లలోని శ్రీ శివానీ, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ పరీక్షలకు 487 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. అభ్యర్థులు పరీక్షలను రెండు పూటల రాయాల్సి ఉంటుందని, ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.00గం.ల వరకు, అలాగే మధ్యాహ్నం 3.00గం.ల నుండి సాయంత్రం 5.30గం.ల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రెండు గంటల ముందే హాజరుకావలసి ఉంటుందని, అయితే కోవిడ్ దృష్ట్యా పరీక్షా సమయం ప్రారంభ సమయం వరకు ఏ.పి.పి.యస్.సి ప్రత్యేక అనుమతిని ఇచ్చినట్లు డి.ఆర్.ఓ తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ తో పాటు నాన్ కోవిడ్ డిక్లరేషన్ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందని, కోవిడ్ లక్షణాలు ఉన్నట్లు అభ్యర్థులు తెలియజేసిన లేదా థర్మల్ స్క్రీనింగ్ నందు కోవిడ్ ఉన్నట్లు రుజువైన వారికోసం ప్రతీ పరీక్షా కేంద్రంలో ఐసోలేషన్ ల్యాబ్ లను ఏర్పాటుచేసినట్లు డి.ఆర్.ఓ స్పష్టం చేసారు. అలాగే కోవిడ్ దృష్ట్యా అభ్యర్థులు తమతో పాటు ట్రాన్స్పరెంట్ వాటర్ బాటిల్ తెచ్చుకునేందుకు ప్రత్యేక అనుమతిని మంజూరుచేయడం జరిగిందని వివరించారు. జిల్లాలోని 4 సెంటర్లకు గాను మూడు సెంటర్లలో దివ్యాంగులు లేరని, జి.యం.ఆర్.ఐ.టి నందు ఒకరు దివ్యాంగులు ఉన్నారని, వారికోసం అభ్యర్థి ప్రత్యేకంగా అటెండెంట్ ను తీసుకువచ్చుటకు అనుమతిని మంజూరుచేయాలని, లేనియెడల కళాశాల యాజమాన్యం ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ యస్.ఓ పి.ఢిల్లీశ్వరరావు, ఏ.యస్.ఓ పద్మప్రియ, చీఫ్ సూపరింటెండెంట్లు, జి.యం.ఆర్.ఐ.టి, శివానీ, శ్రీ వెంకటేశ్వర, ఐతమ్ కళాశాలల ప్రతినిధులు, ఉప తహశీల్దారులు, లైజనింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని డెంకాడ మండల కేంద్రంలో నిర్వహించిన వై.ఎస్.ఆర్.ఆసరా వారోత్సవాల్లో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు శ్రీ బడ్డుకొండ అప్పల నాయుడు, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ కే.సుబ్బారావు.
**- వార్తావళి, నెల్లిమర్ల**



జర్నలిస్టుల నిరసన దీక్షలో పాల్గొన్న ఎపీయూడబ్ల్యుజె నాయకులు పిశివప్రసాదరావు. శేషగిరిరావు. పి అప్పారావు. ఎలిశెట్టి సురేష్.
**- వార్తావళి, పార్వతీపురం**

# ప్రార్థనా మందిరాల రక్షణ మనందరి బాధ్యత

## విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి




**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** విజయనగరం జిల్లాలోని అన్ని మతాల పెద్దలతో "శాంతి" సమావేశాన్ని విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా ప్రజలు శాంతి, సహనం, విజయానికి ప్రతీకలన్నారు. మతాలు ఎన్ని ఉన్నప్పటికీ అన్ని పండగలను మతాలకు అతీతంగా నిర్వహించుకుంటూ, మత సామరస్యాన్నికి వారదులుగా జిల్లా ప్రజలు నిలుస్తున్నారన్నారు. మనందరి మతాలు వేరైనప్పటికీ మనమంతా మనుష్యులేనని, మనలో మానవత్వం ఉన్నదని మరవద్దన్నారు. దురదృష్టవసాత్తు ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగితే, వాటిని విచారించి, చర్యలు తీసుకొనేందుకు రాజ్యాంగబద్ధంగా, రాగ ద్వేషాలకు అతీతంగా పని చేసే పోలీసు వ్యవస్థ ఉందన్నారు. జరిగిన సంఘటనను ఒక మతానికి ముడి వేసి, మనలో మత విద్వేషాలు రెచ్చగొట్టే దుష్ట శక్తులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ పి. వీరాంజనేయ రెడ్డి, ఎస్బీ డిఎస్పీ వివి అప్పారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సిఐ ఎన్. శ్రీనివాసరావు, డిసిఆర్బి సిఐ బి. వెంకటరావు, 1వ పట్టణ సిఐ జె. మురళి, 2వ పట్టణ సిఐ సిహెచ్. రాజుల నాయుడు మరియు ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, హిందూ మత పెద్దలు, దేవాదాయశాఖకు చెందిన అధికారులు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గన్నారు.

# బీజేపీ కొత్త రాష్ట్ర కమిటీ.. సోము వీర్రాజు మార్క్



ఏపీ రాజకీయాల్లో దూకుడుగా ముందుకెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అదే ఊపులో రాష్ట్ర కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. 2024లో అధికారమే లక్ష్యంగా బలమైన నేతలకు చోటు కల్పించారు. కొత్త టీంలో సోము వీర్రాజు ఎంపిక చేసిన వారికే ప్రాధాన్యత దక్కినట్టు తెలుస్తోంది. మొత్తం 40 మంది సభ్యులతో బీజేపీ రాష్ట్ర కొత్త కమిటీ ఏర్పడింది. ఇందులో 10మంది ఉపాధ్యక్షులు 10 మంది కార్యదర్శులు ఐదుగురు ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. బీజేపీ కార్యవర్గంలో ప్రధానంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు ఆదినారాయణ రెడ్డి విష్ణుకుమార్ రాజు రేలంగి శ్రీదేవి విజయలక్ష్మీ మాలతి రాణి నిమ్మల జయరాజు వేణుగోపాల్ సురేందర్ రెడ్డి చంద్రమౌళిలను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా వీవీఎన్ మాధవ్ విష్ణువర్ధన్ రెడ్డి సూర్యనారాయణ రాజు మధుకర్ ఎల్ గాంధీలను నియమించారు. స్పోక్స్ పర్సన్గా చందు సాంశివరావును నియమిస్తూ సోము వీర్రాజు ఆదివారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబుతోపాటు టీడీపీ నుంచి బీజేపీలో చేరిన మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి ఈ కమిటీలో స్థానం లభించింది. ఈ కమిటీపై సోము వీర్రాజు తనదైన ముద్ర వేసినట్టు కనిపిస్తోంది. పార్టీ విధేయులకే పెద్ద పీట వేశారు.

# ప్రశ్నోత్తరాల సమయం రద్దును వ్యతిరేకిస్తూ ఆప్ నిరసన



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** నేటి నుండి ప్రారంభమయ్యే వర్షాకాలం పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నిరసన తెలిపింది. సోమవారం నాడు ఆ పార్టీ కార్యాలయం వద్ద రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కన్వీనర్ కె. దయానంద్ పూలమాలవేసిన అనంతరం పార్టీ సభ్యులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డు లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి అర్థమే జవాబుదారీతనమని అటువంటిది ప్రశ్నోత్తరాలే లేకుండా చేయడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనని అన్నారు. ప్రస్తుతం దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటుందని, జీడీపీ మైనస్ 24%కి దిగజారిందని, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, కరోనా కేసులలో ప్రపంచంలోనే ముందున్నామని, ఉపాధి అవకాశాలు లేవని, పారిశ్రామిక రంగం కుదేలు ఇటువంటి అనేక సమస్యలుపై కేంద్రం చూపించే పరిష్కారం కోసం దేశమంతా పార్లమెంట్ వైపు చూస్తుందని, కేంద్రం మాత్రం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నోత్తరాలను రద్దు చేసిందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తుందని, అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని నియంతృత్వ పాలన సాగిస్తుందని, ప్రజలంతా కేంద్రం తీరును వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, సైలాడ రమణ, కిలాని శ్రీను, సరోజినీ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో రోగాలను అరికట్టవచ్చు

## డిఎలెక్ట్ గవర్నర్, యడ్ల గణేష్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** అయ్యన్నపేట జంక్షన్ కూడలిలో ఉన్న శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నడక మైదానంలో క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలెక్ట్ గవర్నర్ యడ్ల గణేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా శ్రేయస్కరమని, దీనితో అంటువ్యాధులు, మరే ఇతర వ్యాధులు రాకుండా అరికట్టవచ్చునని అన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామ కృష్ణారావు(బాలు) మాట్లాడుతూ నడక మైదానంలో పేరుకుపోయిన కలుపు మొక్క లను, చెత్తను క్లబ్ సభ్యుల సహాయంతో ఏరివేసామని, లాక్ డౌన్ కారణంగా ఇంతవరకు క్లబ్ కార్యక్రమాలు చేపట్లేదని, ఇకనుంచి క్లబ్ చేపట్టబోయే సేవకార్యక్రమాలు యధావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ములగ శ్రీనివాసరావు, కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు, క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతి రావు,క్లబ్ పెద్దలు వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ, నడుపూరి వెంకటరమణ, గోవిందరావు, లక్ష్మణరావు,ఈశ్వరరావు, యడ్ల శ్రీనివాసరావు,పైడియ్య, నాగరాజు, జాలీవాకర్ నలమరాజు పాల్గొన్నారు.

# విజయనగరం జిల్లాపై ఎందుకీ వివక్ష: భీశెట్టి




**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** విజయనగరం జిల్లాకి ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు చెయ్యకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలు ఉన్నచోట మరలా మంజూరు చెయ్యడంని జిల్లా ప్రజలు సహించలేక పోతున్నారని లోక్సత్తపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల కోసం నిన్న 2050 కోట్లు మంజూరు చేసిందని ఇప్పుడు ప్రభుత్వ వైద్యకళాశాలలు ఉన్నజిల్లాల్లో నే మరలా అదనంగా కడపజిల్లా పులివెందుల, గుంటూరు జిల్లా పిడుగురాళ్ల,కృష్ణాజిల్లా మచిలీపట్నంలో వైద్యకళాశాలలు మంజూరుచేస్తూ 2050 కోట్లు మంజూరు చెయ్యడం విజయనగరం జిల్లాని వివక్షకు గురిచెయ్యడమే నని భీశెట్టి ఆవేదన చెందారు,గత ప్రభుత్వం లో చంద్రబాబు కూడా నిమ్మకి నీరెత్తినట్లు ప్రవర్తించి జిల్లాకి అన్యాయం చేశారని విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల కోసం తగినంత స్థలం సిద్ధంగా ఉన్నా పాలనా అనుమతి ఇవ్వకపోవడం అన్యాయ మని జిల్లాలో మంత్రులు,ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి పై వత్తిడి తేవడంలో విఫలమయ్యారని భీశెట్టి మండిపడ్డారు.

# రోజుకు 5వేలకు పైగా కోవిడ్ టెస్టులు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్లాల్



**కొత్తవలస, వార్తావళి, సెప్టెంబర్ 14 :** జిల్లాలో రోజుకు 5వేలకు తక్కువ కాకుండా కోవిడ్ నిర్ధారణా పరీక్షలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్లాల్ ఆదేశించారు. కలెక్టరేట్లోని కోవిడ్ కమాండ్ కంట్రోల్ రూమును ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. కోవిడ్ పేషెంట్ల హెూం ఐసోలేషన్, టేపింగ్, టెస్టింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్, మ్యాపింగ్, డిస్ఛార్జ్, ఫీవర్ కేసెస్ తదితర అంశాలపై ఆయా విభాగాల సిబ్బందితో సమీక్షించారు. హెూం ఐసోలేషన్లో ఉన్నవారికి వైద్యుల ద్వారా లేదా ఎఎన్ఎంల ద్వారా అందుతున్న సేవలపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు సగటున 5,500 కరోనా నిర్ధారణా పరీక్షలు చేయాలని ఆదేశించారు. కనీసం 5వేలకు తక్కువ కాకుండా చూడాలని, ఆరువేలు పరీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా రోజువారీ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతీ కేసును తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని, 50ఏళ్లకు పైబడిన వారిని ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ ఎం.గణపతిరావు కూడా ఉన్నారు.

# ధర్నాలు, ర్యాలీలకు కోవిడ్-19 నిబంధనలు తప్పక పాటించాలి

## ఐ.టి.డి.ఏ, ప్రాజెక్ట్ అధికారి కూర్మనాథ్



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కోవిడ్ 19 దృష్ట్యా, కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఇటువంటి సమయంలో గిరిజనుల సమస్యలు ఎప్పటి కప్పుడు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని ప్రతి సోమవారం టెలీ స్పందన నిర్వహించడం జరుగుతుంది. టెలీ స్పందనలో వచ్చిన పిర్యాదులు సత్వరం పరిష్కరించు నిమిత్తం సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టడం జరుగుతుంది అని ఐ.టి.డి.ఏ, ప్రాజెక్టు అధికారి ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. కోవిడ్ 19 దృష్ట్యా, కరోనా వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది. అయితే ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ దరఖాస్తులు అందజేయడానికి వచ్చిన వారు తప్పకుండా కోవిడ్ 19 నిబంధనల ప్రకారం ముందు తహశీల్దార్ అనుమతి తీసుకొని, కోవిడ్ 19 నిబంధనలు తప్పక పాటించాలి. మాస్క్ ధరించి, సామాజిక దూరాన్ని పాటించినట్లయితే, తద్వారా కరోనా వ్యాప్తిని తగ్గించ వచ్చుని ప్రాజెక్ట్ అధికారి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## శిశు మరణాల నివేదిక

చిన్నారుల ఆరోగ్యం పట్ల ఎలా వ్యవహరిస్తున్నామన్న అంశమే ఏ సమాజ భవిష్యత్తుకైనా గీటురాయి అవుతుందని నల్ల సూరీడు నెల్సన్ మండేలా ఒక సందర్భంలో చెప్పారు. శిశువులను జాతి సంపదగా భావించి వారి శ్రేయస్సుకు చేతనైనదంతా చేస్తేనే భవిష్యత్తు సమాజం మెరుగ్గా వుంటుంది. సహస్రాబ్ది లక్ష్యాల్లో ఒకటైన శిశు మరణాల నియంత్రణలో మన దేశం ఆనాటికానాటికి పురోగతి సాధిస్తోందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వున్న శిశు మరణాల అధ్యయన సంఘం నివేదిక చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం 1990లో మన దేశంలో అయిదేళ్ల వయసులోపు పిల్లల్లో ప్రతి వేయి మందికి 126మంది చనిపోయేవారు. ఇప్పుడా సంఖ్య 34కి తగ్గింది. ఈ వయసు పిల్లల్లో మరణాల రేటు గత రెండు దశాబ్దాల్లో ఏటా 4.5 శాతం చొప్పున తగ్గుతున్నదని నివేదిక అంటోంది. అంకెల రూపంలో చెప్పాలంటే 1990లో అయిదేళ్లలోపు పిల్లల మరణాలు మన దేశంలో 34 లక్షలుంటే... ఇప్పుడది 8,24,000కు తగ్గింది. మాతా శిశు సంరక్షణ కోసం పథకాలు రూపొందించి, వాటికి తగినన్ని నిధులు కేటాయించడం వల్లే ఇది సాధ్యమైందని చెప్పుకోవాలి. అయితే ఈ కృషి సరిపోదు. ఈ రంగంలో మరింత శ్రద్ధ పెట్టి పనిచేస్తేనే అనుకున్న లక్ష్యాలు సాధించగలమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ప్రపంచంలో అయిదేళ్లలోపు పిల్లల మరణాల్లో 49 శాతం కేవలం అయిదు దేశాల్లో సంభవిస్తున్నాయని నివేదిక వివరిస్తోంది. ఆ అయిదు దేశాల్లో నైజీరియా ప్రథమ స్థానంలో వుంటే మన దేశం రెండో స్థానంలో, పాకిస్తాన్, ఇథియోపియా, కాంగో ఆ తర్వాతి స్థానాల్లో వున్నాయి. అంటే ప్రపంచ దేశాల్లో సంభవిస్తున్న మరణాల్లో దాదాపు సగం ఈ దేశాల్లోనే జరుగుతున్నాయి. గర్భధారణ సమయంలో మహిళలకు అవసరమైన పోషకాలు లభ్యమయ్యేలా చూస్తే, వారి ఆరోగ్యానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటే పుట్టే శిశువు ఆరోగ్యవంతంగా వుంటుంది. ఆ సమయంలో మహిళకు అందించే కొద్దిపాటి ఆసరా ఆమె ప్రాణాలను నిలబెట్టడమే కాదు... పుట్ట బోయే శిశువుకు సైతం ఎంతగానో ఉపకరిస్తుంది. గర్భిణులూ, బాలింతల్లో రక్తహీనత వుంటే శిశువుల్లో కూడా ఆరోగ్యపరమైన సమస్యలు తప్పవు. ప్రసూతి సమయంలో సమస్యలు ఏర్పడటం, తక్కువ బరువుతో శిశువు జన్మించడం, పుట్టిన నెలలోనే వ్యాధిబారిన పడటం, న్యూమోనియా, డయేరియా, మలేరియా వంటి వ్యాధులు అయిదేళ్లలోపు శిశువుల మరణాలకు కారణమవుతు న్నాయి. సకాలంలో వ్యాక్సిన్‌లు అందించడంవల్లనే గత మూడు దశాబ్దాల్లో ఈ మాదిరి మరణాలు చాలా వరకూ అరికట్టడం సాధ్యమైంది. అయితే ఈ కృషి మరింతగా పెరగాలి. మన గ్రామీణ ప్రాంతాల్లో వైద్యపరమైన సదుపాయాలు ఇప్పటికీ అంతంతమాత్రమేనన్నది చేదు నిజం. పేరుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా అక్కడ తగినంతగా సిబ్బంది వుండరు. అవసరమైన మందులు లభించవు. ఊరూరా తిరిగి గర్భిణులను గుర్తించి, వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించే విస్తృతమైన నెట్ వర్క్ మన దేశంలో అమలవుతోంది. కానీ ఇదింకా పూర్తి సంతృప్తికరంగా లేదు. ఆ నెట్‌వర్క్ ద్వారా గర్భిణులకు కొంత మేర సాయం అందుతున్నా వైద్య రంగ మౌలిక సదు పాయాలు పూర్తి స్థాయిలో లేకపోవడం పెద్ద శాపంగా మారింది. కనుకనే ప్రసవాల కోసం మంత్ర సానులను ఆశ్రయించే ఆచారం ఇంకా తగ్గలేదు. ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాల కన్నా దక్షిణాది రాష్ట్రాలు ఎంతో మెరుగని చెప్పాలి. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగినప్పుడే నవ జాత శిశుమరణాలు తగ్గుముఖం పడతాయని వైద్యరంగ నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. 2030 నాటికల్లా ప్రపంచ దేశాలన్నీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని 2015 సెప్టెంబర్‌లో ఐక్య రాజ్యసమితి తీర్మానించింది. ఈ లక్ష్యాల్లో పేదరిక నిర్మూలన, శిశు మరణాల తగ్గింపు, ఆహారభద్రత, నాణ్యతగల విద్య తదితరాలున్నాయి. ఇవి సాధించాలంటే మనం ఇంకా ఎంతో కృషి చేయాల్సిన అవసరం వుంది. అలా చేయగలిగితే నైజీరియా, పాకిస్తాన్, కాంగో వంటి దేశాల సరసన చేరే పరిస్థితి రాదు. కరోనా వైరస్ మహమ్మారి విరుచుకుపడి అన్ని రంగాలనూ ధ్వంసం చేసినట్టే ఆరోగ్య రంగ వ్యవస్థనూ కూడా దెబ్బతీసింది. ముఖ్యంగా శిశు మరణాల అదుపుకోసం దశాబ్దాలుగా శ్రమించి సాధించిన విజయాలను అది నాశనం చేసే ప్రమాదం కనబడుతోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలన్నీ అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తీసుకుం టున్న చర్యలు ఎంతో ప్రశంసించదగ్గవి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రామీణ వైద్యం రూపురేఖలు మార్చడానికి నడుంకట్టింది. రాష్ట్రంలో 7,458 ఆరోగ్య ఉపకేంద్రా లుంటే వాటిల్లో 80 శాతం కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఇకపై ప్రతి ఒక్క కేంద్రానికీ అన్ని సదుపాయాలతో కూడిన సొంత భవనం వుండాలన్నది ఏపీ ప్రభుత్వం తాజాగా పెట్టుకున్న లక్ష్యం.

## సెప్టెంబర్ 15 మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

**భారతదేశంలో ఇంజనీర్ల దినోత్సవము.**

**973 : ముస్లిం బహుముఖ ప్రజ్ఞాశాలి అల్ బెరూని జననం (మ.1048).**

**1254 : ప్రపంచ యాత్రికుడిగా ప్రసిద్ధి చెందిన మార్కో పోలో జననం (మ.1325).**

**1856: పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి మరియు వాగ్గేయకారుడు నారదగిరి లక్ష్మణదాసు మరణం (మ.1923)**

**1861 : భారతదేశపు ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జననం (మ.1962).(చిత్రంలో)**

**1876 : ఇరవయ్యవ శతాబ్దపు ప్రముఖ బెంగాలీ నవలా రచయిత మరియు కథా రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ్ జననం (మ.1938).**

**1890 : తెలుగు రంగస్థల నటుడు, తొలితరం చలనచిత్ర నటుడు పులిపాటి వెంకటేశ్వర్లు జననం. (మ.1972)**

**1931 : తొలి తెలుగు టాకీ చిత్రం భక్తప్రహ్లాద విడుదల.**

**1937 : అమెరికా ఆర్థికవేత్త మరియు అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత రాబర్ట్ లుకాస్ జననం.**

**1961 : వెస్టిండీస్ క్రికెట్ క్రీడాకారుడు పాట్రిక్ ప్యాటర్సన్ జననం.**

**1967 : తెలుగు, తమిళ, మలయాళ, హిందీ సినిమా నటీమణి రమ్యకృష్ణ జననం.**

**2015 : హిందీభాషాప్రవీణుడు, "హిందీ చందమామ" సంపాదకుడు వై.బాలశౌరిరెడ్డి మరణం.(జ.1928)**



విశ్వేశ్వరయ్య 1861, సెప్టెంబరు 15న బెంగుళూరు నగరానికి 60 మైళ్ళ దూరంలోగల చిక్కబళ్ళాపూర్ తాలూకా, ముద్దెనహళ్ళి అనే గ్రామంలో జన్మించాడు. అతను తల్లిదండ్రులు మోక్షగుండం శ్రీనివాస శాస్త్రి, వెంకటలక్ష్మమ్మ. వీరి పూర్వీకులు ఆంధ్ర ప్రదేశ్, ప్రకాశం జిల్లా లోని మోక్షగుండం గ్రామానికి చెందిన వారు. మూడు శతాబ్దాల కిందట వారు మైసూరు రాష్ట్రానికి వలస వెళ్ళారు. కాబట్టి వీరు తెలుగు మాట్లాడగలిగే వారు. అతను తండ్రి సంస్కృత పండితుడు, హిందూ ధర్మశాస్త్ర పారంగతుడే కాక ఆయుర్వేద వైద్యుడు కూడా. విశ్వేశ్వరయ్యకు 12 సంవత్సరాల వయసులో తండ్రి మరణించాడు. చిక్కబళ్ళాపూరు లో ప్రాథమిక విద్య, బెంగుళూరులో ఉన్నతవిద్య పూర్తి చేసాడు. 1881లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.ఏ., తరువాత పుణె సైన్సు కాలేజి నుండి సివిలు ఇంజనీరింగు ఉత్తీర్ణుడయ్యాడు. పుణెలో ఇంజనీరింగు పూర్తయిన తరువాత తన 23వ యేట బొంబాయి ప్రజా పనుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా చేరిన తరువాత, భారత నీటిపారుదల కమిషను చేరవలసినదిగా ఆహ్వానం వచ్చింది. అతను దక్కను ప్రాంతంలో చక్కని నీటిపారుదల వ్యవస్థను రూపొందించాడు. నీటి ప్రవాహానికి తగినట్లుగా ఆనకట్టకు ఎటువంటి ప్రమాదం కలగకుండా నీటిని నిల్వచేయగలిగిన ఆటోమాటిక్ వరద గేట్ల వ్యవస్థను అతను రూపొందించాడు. 1903లో మొదటిసారిగా దీనిని పుణె దగ్గరి ఖడక్‌వాస్లా వద్ద నెలకొల్పారు. వరద సమయంలో ఆనకట్ట భద్రతను దృష్టిలో ఉంచుకుంటూనే అత్యధిక నీటి నిల్వ చేసే విధానం ఇది. దీని తరువాత గ్వాలియర్ వద్ద అల తిగ్రా వద్ద, మైసూరు వద్ద గల కృష్ణరాజ సాగర్ ఆనకట్టలలోను దీనిని వాడారు. 1906-1907 మధ్య కాలంలో అతన్నే భారత ప్రభుత్వం యెమెన్ లోని ఆడెన్ కి పంపించి అక్కడి నీటి పారుదల వ్యవస్థనూ, మురికి కాలువల వ్యవస్థను రూపకల్పన చేయమని కోరింది. అతను నిర్దేశించిన పథకం ప్రకారం అక్కడ మంచి ప్రాజెక్టు విజయవంతంగా పూర్తిచేయబడింది. హైదరాబాదు నగరాన్ని వరదల నుండి రక్షించడానికి ఒక వ్యవస్థను రూపొందించినపుడు, అతనుకు గొప్ప పేరు వచ్చింది. విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో కూడా అతను పాత్ర ఉంది.. కావేరీ నది పై నిర్మించిన కృష్ణరాజసాగర్ ఆనకట్ట ఆది నుంచి అంతం వరకు అతను పర్యవేక్షణలోనే జరిగింది. అప్పట్లో కృష్ణరాజ సాగర్ ఆనకట్ట ఆసియా ఖండంలోనే అతిపెద్దది. 1917లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజి స్థాపించడంలో ముఖ్యపాత్ర వహించాడు. తరువాత ఈ కాలేజికి అతను పేరే పెట్టడం జరిగింది. ఈనాటికి యూనివర్సిటీ విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కర్ణాటక లోని పేరున్న విద్యా సంస్థల్లో ఒకటి. మైసూరు విశ్వవిద్యాలయం నెలకొల్పటంలో కూడా అతను పాత్ర ఉంది. పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందడానికి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాడు.

## వీణాపాణి ఆవిర్భావం ఎలా?

సరస్వతీ దేవి బ్రహ్మదేవుని మానస పుత్రిక. ఆమె ఆ ఆదిదేవుని మనసు నుండి పుట్టింది. 'ఋగ్వేదం'లోనూ, 'దేవీ భాగవతం'లోనూ, 'బ్రహ్మ వైవర్త పురాణం'లోనూ (2.6.13-95), 'పద్మ పురాణం'లోనూ సరస్వతి మాత గురించిన వివిధ గాథలున్నాయి. ఆ దేవి ఆద్యంత రహిత శక్తి స్వరూపిణి. బ్రహ్మదేవుడు సకల సృష్టికర్త. కనుక, సరస్వతిని కూడా బ్రహ్మయే సృష్టించాడనీ, సృష్టి కార్యంలో తనకు తోడుగా ఉండటానికి తన జిహ్వపై ఆమెను నిలుపుకున్నాడని కూడా ఒక కథనం. సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి బ్రహ్మకు 'శక్తి స్వరూపిణి'గా సరస్వతిని 'శ్రీమాతాదేవి' ప్రసాదించిందని 'దేవీ భాగవతం' చెబుతున్నది. పూర్వం సృష్ట్యంత్య కాలంలో మొత్తం అంతటా నీరు వ్యాపించింది. అప్పుడు జగత్తంతా చీకటి ఆవరించింది. ఆ సమయంలో ఆ నీటి నడుమ శ్రీమన్నారాయణమూర్తి 'వటపత్ర శాయియై' యోగనిద్రలో ఉన్నాడు. ఆ సమయంలో బ్రహ్మదేవుడు అతనిలోని బ్రహ్మాండాల తత్త్వాన్ని తెలుసుకోవడం కోసం అతని గర్భంలోకి ప్రవేశిస్తాడు. తర్వాత ఆ దేవదేవుని నాభిలోంచి మొలిచిన కమలం నుండి వెడలి వచ్చి, ఆ



భగవంతుని నియోగంతో జగత్ సృష్టి చేయడం మొదలుపెడతాడు. నవబ్రహ్మలను సృష్టించిన పిమ్మట 'సర్వశుక్లా' అంటే 'తెల్లని రూపంతో మెరిసిపోయే సరస్వతీ దేవి'ని సృష్టించాడు. బ్రహ్మ తానే సృష్టించిన సరస్వతీ దేవిని చూసి విభ్రాంతి చెందుతాడు. ఆమెకు ఆకర్షితుడై తనను భార్యగా చేసికొంటాడు. ఆ రూపాన్ని మార్చుకొని పరిణయమాడి తన జిహ్వాగ్రంపైన ఆమెను నిలుపుకున్నాడనేది ఒక కథనం. 'సరస్‌ంమతుప్, సరః రసః విజ్ఞానం వా విద్యతే స్యామ్. రసం, జ్ఞానం కలది. వాక్, బుద్ధి, వివేకం, విద్య, కళలు, విజ్ఞానం.. వీటన్నిటికీ అధిదేవతగా మనం సరస్వతీదేవిని పూజిస్తున్నాం. ఈ అమ్మవారు హంసవాహినిగా, వీణాపాణిగా, పుస్తక, మాలాధారిణిగా చిత్రితమై, అరువది నాలుగు కళలకు అధిదేవతగా నిలిచింది. ఆమె ధరించే వీణ పేరు కచ్ఛపి.

## అయోధ్యకు చేరిన సుమంత్రుడు

(నిన్నటి తరువాయి)

భర ద్వాజ మహర్షి చెప్పింది గుర్తుకు వచ్చిందప్పుడు. ఆ చెట్టుకి ప్రదక్షిణలు చేసింది సీత."వృక్ష రాజా! నా మొక్కును స్వీకరించు. మా వనవాసం క్షేమంగా గడిచేట్టుగా ఆశీర్వదించు. వనవాసానంతరం కౌసల్యా, సుమిత్రాదేవులను దర్శించ గలిగే భాగ్యాన్ని ప్రసాదించు." ప్రార్థించింది. ముగ్గురూ బయల్దేరారక్కణ్నుంచి. దారిలో రకరకాల చెట్లనూ, పువ్వులనూ, లతలనూ చూసి ముచ్చటపడసాగింది సీత. ఏ చెట్టు ఎందుకు పనికి వస్తుందో, ఏ పువ్వు దేనికి అలంకారమో, ఏ లత వినియోగం ఆరోగ్యకరమో అన్నీ రాముణ్ణి అడిగి తెలుసుకున్నది సీత. కావాలన్న పువ్వులనూ, పండ్లనూ లక్ష్మణుడు వదినకు అందిస్తూ వచ్చాడు.సాయంత్రానికి ఓ సరస్సు దగ్గరకు చేరుకున్నారు. దగ్గరగా ఏనుగుల ఘీంకారాలు వినవచ్చాయి. పరుగులుదీస్తూ కోతులు కనిపించాయి. ఎటు చూస్తే అటు నెమళ్ళూ, హంసలూ... అందంగా ఉంది ఆ ప్రాంతం. ఆ రాత్రికి అక్కడ బస చేయాలనుకున్నారు. లేడిమాంసాన్ని తిని, నిద్రపోయారు.తెల్లారింది. ముందుగా రాముడు మేల్కొన్నాడు. లక్ష్మణుణ్ణి చూశాడు. బాగా అలసిపోయాడేమో! ఇంకా గాఢనిద్రలో ఉన్నాడతను. "లక్ష్మణా" అని పిలిచి, చేత్తో తట్టి అతన్ని మేల్కొలిపాడు రాముడు. కాలకృత్యాలు నెరవేర్చుకున్నారు. మహర్షి చెప్పిన మార్గంలో మళ్ళీ ప్రయాణించసాగారు. జీడిమామిళ్ళు, రంగురంగుల పూలు, పళ్ళతో నిండిన చెట్లను చూస్తూ, వాటి అందాలకి అబ్బురపడుతూ ఆఖరికి చిత్రకూటపర్వతానికి చేరుకున్నారు. పర్వతం నిండా చెట్లే. విరగకాసి, పళ్ళతో వంగి కానవచ్చాయి. తేనెపట్టుల సంగతి చెప్పనవసరం లేదు. కొమ్మకొమ్మకీ చేటలంతేసి తేనెపట్లు. ఆ బరువుకి కూడా చెట్లన్నీ వంగిపోయి కనిపించాయి. అందమైన లతలు, పక్షులు, మృగాలు... పర్వతం చూడముచ్చటగా ఉంది. పర్వతాన్ని చుట్టుకుని ప్రవహిస్తోంది మాల్యవతీనది. అలా ఆ నదిని చూడడమే ఓ అదృష్టంగా భావించారు సీతారామ లక్ష్మణులు. మహర్షుల ఆశ్రమాలు కూడా కనిపించాయి వారికి. అక్కడ ఎవరెవరు నివసిస్తున్నదీ వారినీ వీరినీ అడిగి తెలుసుకున్నాడు రాముడు. వాల్మీకి మహర్షి అక్కడే ఉంటున్నాడని తెలుసుకుని, మహదానందించాడు. సీతాలక్ష్మణులతో వెళ్ళి కలిశాడతన్ని.ముగ్గురూ ఆ మహర్షికి నమస్కరించారు. తమ నామాలు తెలియజేశారు. అడవులకు ఎందుకు వచ్చిందీ వివరంగా తెలిపారు. అంతా తెలుసునన్నట్టుగా సన్నగా నవ్వుతూ తలూపాడు వాల్మీకి."ఈ ప్రాంతం మీకు అన్ని రకాలుగా అనువుగా ఉంటుంది. హాయిగా ఇక్కడ నివసించండి. మీకు మా సహాయసహకారాలు అందించే భాగ్యాన్ని కూడా మాకు కలుగజేయండి." వేడుకున్నాడు వాల్మీకి. అంగీకరించాడు రాముడు. పర్ణశాల నిర్మాణంలో తలమునకలయ్యాడు లక్ష్మణుడు. వెదుళ్ళతోనూ, రెల్లు తీగలతోనూ, చక్కని వేది, తలుపులు, కిటికీలతో, గాలీవానలకు చలించని, దృఢమైన, మనోజ్ఞమైన పర్ణశాలను నిర్మించాడతను. 'పర్ణశాల ప్రవేశం చెయ్యన్నయ్యా" ఆహ్వానించాడు లక్ష్మణుడు. రాముడు స్నానం చేశాడు. పూలు, పళ్ళతో దేవతలను పూజించాడు. మంత్రవంతంగా వాస్తుశాంతీ, భూతశాంతీ చేశాడు. తర్వాత సతీసమేతంగా పర్ణశాల ప్రవేశం చేశాడు.ఫఫఫసీతారామలక్ష్మణులు గంగను దాటి వెళ్ళిపోయినా కొన్నాళ్ళు శృంగిబేర పురంలో గుహుని ఆతిథ్యంలో ఉన్నాడు సుమంత్రుడు. అయోధ్యకు తిరిగివెళ్ళిపోయేందుకు తొందర పడలేదతను. రామవనవాసం గురించి ఆలోచిస్తూ గడిపాడక్కడ. ఏమో! ఎవరికి తెలుసు? అడుగడుగునా వదినగారి కష్టాలు గమనించి లక్ష్మణుడు కన్నీరు పెట్టుకుంటే... వెనక్కి వెళ్ళిపోదాం అన్నయ్యా అని రాముణ్ణి వేడుకుంటే... సీతాలక్ష్మణుల మీది ప్రేమతో రాముడు వెను తిరిగితే... తాను ఈ ఒడ్డున లేకపోతే ఎలా? అనుకుంటూ సుమంత్రుడు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ గంగ ఒడ్డున రథంతో సిద్ధంగా ఉండి, వారి కోసం ఎదురుచూడసాగాడు. రెండు మూడు రోజులు గడిపాడలా. ఒకనాడు చీకటి పడినా తిరిగి రాని సుమంత్రుణ్ణి వెదుక్కుంటూ గుహుడు వచ్చాడక్కడికి. గంగ అవతలి ఒడ్డు వైపే చూపు నిలిపి నిల్చున్న సుమంత్రుణ్ణి గమనించాడు."పెద్దాయనా" పిలిచాడు."రామయ్య వస్తాడేమో! వచ్చే వేళకు నేనిక్కడ లేకపోతే ఎలా చెప్పు? అందుకే అటుగా చూస్తున్నాను, అప్పుడే ఇంతగా చీకటి పడిందా?" చుట్టూ చూశాడు సుమంత్రుడు. గూళ్ళకు పక్షులు చేరుకుంటూ గోల చేస్తున్నాయి. ఆ గోల అతనికి వినరాలేదంటే...సుమంత్రుడు ఎంత దీక్షగా చూస్తూ నిల్చున్నాడో అర్థం చేసుకున్నాడు గుహుడు. అప్పుడిలా చెప్పాడతను."ఇక రామయ్య రాడు పెద్దాయనా! రామయ్య చిత్రకూటానికి వెళ్ళిపోయాడు." "అవునయ్యా! ఆ మాట నిజం."

(మిగతా రేపటి సంచికలో)

## కీళ్లనొప్పులను నయంచేసే మందును ఇంట్లోనే తయారు చేసుకోండి!

తలనొప్పి, జలుబు, దగ్గు, నడుమునొప్పి ఇలా నొప్పి ఏదైనా దానికి వాడే ఏకైక మందు పెయిన్ బామ్. ఇదివరకు ఇది క్రీమ్ టైప్‌లో వచ్చేది. ఇప్పుడు స్ప్రే రూపంలో దొరుకుతుంది. అయితే ఏ చిన్న నొప్పి వచ్చినా పనిచేసుకోవడానికి ఇబ్బంది కలుగుతుంటుంది. చేసే పని కూడా లేట్ అవుతుంది. దీంతో చిన్న చితక జబ్బులకు కూడా ఇంగ్లీష్ మందులు వాడితే తర్వాత సైడ్ ఎఫెక్ట్స్‌కు గురవుతారు. అందుకని పెయిన్ బామ్‌ను ఇంట్లోనే తయారు చేసుకుంటే మంచిది అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇప్పుడు తయారీ విదానం చూద్దాం.బయట దొరికే పెయిన్ కిల్లర్ మందులు వెంటనే ఉపశమనాన్నిచ్చినా తర్వాత ప్రభావం చూపుతుంది. దీంతో స్టమక్ అప్సెట్, గుండెల్లో మంట, నీరసం, వికారం వంటి పరినామాలకు దారి తీస్తుంది. నొప్పి తగ్గలేదు కదా అని ఎక్కువ డోసేజ్‌లో తీసుకుంటే గుండెపోటు, లివర్ డ్యామేజ్ వంటి వాటికి దారి తీస్తుంది.

**పెయిన్ బామ్‌కు కావాల్సిన పదార్థాలు :**

కర్పూరం : ఒక టేబుల్ స్పూన్ ఎక్స్ట్రా వర్జిన్ కొకోనట్ ఆయిల్ : పావు కప్పు, తురిమిన బీస్వాక్స్ : 2 టేబుల్ స్పూన్స్, లవంగ నూనె : 5 డ్రాప్స్, పెప్పర్‌మింట్ ఎసెన్షియల్ ఆయిల్ : 9 డ్రాప్స్, ఆర్నికా ఎసెన్షియల్ ఆయిల్ : 7 డ్రాప్స్



**తయారీ :** ముందుగా ఒక బౌల్‌లోకి ఎక్స్ట్రా వర్జిన్ కొకోనట్ ఆయిల్‌ను తీసుకోవాలి. ఇందులో తురిమిన బీస్వాక్స్ వేసి బాగా కలుపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని మైక్రోవేవ్‌లో ఈ రెండూ కరిగే వరకు అంటే ఒక నిమిషం పాటు కరిగించాలి. తర్వాత ఇందులో కర్పూరం వేసి కరిగించాలి. 20 సెకండ్లు వేడి చేయాలి. ఆ తర్వాత ఎసెన్షియల్ ఆయిల్స్ వేసి కలుపాలి. బాగా కలిపిన తర్వాత స్టెరిలైజ్ చేసిన కంటైజర్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చాలి. అంతే.. దీనిని ఒక సీసాలో వేసి గట్టిగా మూత పెట్టాలి. ఎండ తగలని ప్రదేశంలో పెడితే పెయిన్ బామ్‌ను ఎప్పడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు.

## మీలో రక్తహీనత ఉందని తెలిపే లక్షణాలు ఇవే..!



శరీరంలో ఐరన్ లోపించడంతోపాటు పలు ఇతర కారణాల వల్ల కూడా చాలా మందికి రక్తహీనత సమస్య వస్తుంటుంది. అయితే అన్ని జబ్బులకూ మన శరీరంలో ముందస్తుగా లక్షణాలు కనిపించినట్లే.. రక్తహీనత ఉన్నవారిలోనూ పలు లక్షణాలు కనిపిస్తాయి. వాటిని ముందుగానే గుర్తించి తగిన విధంగా చర్యలు తీసుకుంటే రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. మరి ఎవరిలో అయినా సరే రక్తహీనత ఉందని తెలిపేందుకు వారిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందామా..! రక్తహీనత ఉన్నవారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొద్ది నిమిషాలు నడిచినా లేదా తేలికపాటి శారీరక శ్రమ చేసినా శ్వాస తీసుకోలేకపోతుంటారు. ఈ సమస్య ఉంటే రక్తహీనత ఉందో, లేదో వైద్యుడిచే పరీక్షలు చేయించుకుని, ఆ మేరకు మందులు వాడాల్సి ఉంటుంది. రక్తహీనత ఉన్నవారి చర్మం పాలిపోయి తెల్లగా కనిపిస్తుంది. లేదా బూడిదరంగులోనూ కొందరి చర్మం దర్శనమిస్తుంది. రక్తం తక్కువగా ఉంటే రక్తకణాల సంఖ్య కూడా తగ్గుతుంది కనుక చర్మం రంగు మారుతుంది. ఇలా గనక ఉంటే రక్తహీనతే అని అనుమానించాలి. శరీరంలో తగినంత రక్తం లేకపోతే అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఛాతి భాగంలో కొందరికి నొప్పిగా అనిపిస్తుంది. అయితే గ్యాస్ లేదా గుండె జబ్బులు ఉన్నవారికి కూడా ఛాతి నొప్పి వస్తుంది కనుక.. వైద్యున్ని సంప్రదిస్తే ఆ సమస్యకు తగిన కారణాన్ని కనుక్కోవచ్చు. రక్తహీనత ఉన్నవారికి మంచు ముక్కలు, పెన్సిళ్లు, పెయింట్, గోడకు రాసిన సున్నం తదితర పదార్థాలను తినాలపిస్తుంటుంది. ఈ రకమైన వింత లక్షణాలు ఉంటే దాన్ని రక్తహీనతేమో అని అనుమానించాలి. శరీరం ఎప్పుడూ చల్లగా ఉంటే రక్తహీనత కారణం అయి ఉండవచ్చు. ఎందుకంటే శరీరంలో తగినంత రక్తం ఉంటే అన్ని భాగాలకు ఉష్ణం సరిగ్గా సరఫరా అవుతుంది. దీంతో శరీరం వేడిగా ఉంటుంది. ఇక రక్తం లేకపోతే శరీరం చల్లగా ఉంటుంది. తరచూ తలనొప్పి వస్తున్నా రక్తహీనత అందుకు కారణం అయి ఉండవచ్చు. ఈ క్రమంలో రక్తహీనత సమస్యను పరిష్కరిస్తే తలనొప్పి కూడా తగ్గేందుకు అవకాశం ఉంటుంది. కనుక తలనొప్పి వస్తున్న వారు రక్తహీనత ఉందని అనుమానించి, పరీక్షలు చేయించుకుని, ఆ విషయాన్ని నిర్ధారించుకుని మందులను వాడితే సమస్య నుంచి బయట పడవచ్చు.

ఏరి చూడ నపుడు
యేవిధముమనము
నడచుకొనెదమదియె నమ్మదగు!
సరియగు నడవడిక సమ్మత
మగునుగ!
తెలిసిమెలగుమయ్య!
తెలుగు వాడ!



- మల్లాది సోమేశ్వర శర్మ,
9603995769

ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి..."పెళ్లి" అనే రెండు అక్షరాలతో మనకోసం, మన ఇంటికి వచ్చింది అంటేనే...ఆ వివాహ బంధం ఎంతో విలువైనది అని అర్థం. అలాంటి అత్యంత విలువైన శాశ్వతమైన బంధాలపై... తాత్కాలికమైన కోపాన్ని ప్రదర్శించడం అవివేకంతో కూడుకున్న పని. ఆవేశం తగ్గిన తర్వాత బంధం యొక్క బలం తగ్గి...కేవలం ఆవేదన మాత్రం మిగులుతుంది...?



- నగేష్ వర్మ విశాఖపట్నం







# ఉత్కంఠగా అల్లరి నరేష్ 'నాంది'



'ఒక మనిషి పుట్టడానికి కూడా తొమ్మిది నెలలే టైమ్ పడుతుంది. మరి నాకు న్యాయం చెప్పడానికేంటి సర్.. ఇన్ని సంవత్సరాలు పడుతోంది' అంటూ ప్రశ్నిస్తున్నారు కథానాయకుడు అల్లరి నరేష్. ఆయన కీలకపాత్రలో నటిస్తున్న చిత్రం 'నాంది'. విజయ్ కనకమేడల దర్శకుడు. మంగళవారం నరేష్ పుట్టిన రోజు సందర్భంగా 'నాంది' టీజర్ విడుదలైంది. యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. "ఈ ప్రపంచాన్ని టీజర్ రూపంలో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. 'నాంది' చిత్ర బృందానికి నా తరఫున హృదయపూర్వక అభినందనలు. నరేష్ అన్న ఇందులో మీరు అద్భుతంగా ఉన్నారు" అని టీజర్‌ను పంచుకున్న సందర్భంగా విజయ్‌దేవర కొండ పేర్కొన్నారు.

ఇక సినిమాలో వరలక్ష్మి శరత్‌కుమార్ లాయర్ ఆద్య పాత్రలో నటిస్తుండగా, రాధా ప్రకాశ్‌గా ప్రియదర్శి, కిషోర్ అనే పోలీస్ పాత్రలో హరీశ్ ఉత్తమన్, సంతోష్‌గా నటుడు ప్రవీణ్ కనిపించనున్నారు. లాక్‌డౌన్ కంటే ముందే ఎనభై శాతం చిత్రీకరణను పూర్తి చేసుకుంది. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకు సంగీతం సమకూర్చారు.

## ఆది సాయికుమార్ 'శశి' చిత్రం డబ్బింగ్ పనులు ప్రారంభం



ఆది సాయికుమార్ హీరోగా నటిస్తోన్న 'శశి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. శ్రీనివాస్ నాయుడు నడికట్ల డైరెక్ట్ చేస్తోన్న ఈ చిత్రాన్ని శ్రీ హనుమాన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఆర్.పి. వర్మ, రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. హీరో ఆది సాయికుమార్ డబ్బింగ్ చెప్పడం ద్వారా సోమవారం 'శశి' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయని బ్యానర్ అధికారిక ట్విట్టర్ అకౌంట్ ద్వారా తెలిపారు. ఆది డబ్బింగ్ చెబుతున్న ఫొటోను షేర్ చేశారు. లాక్‌డౌన్ ముగిసి, సినిమాల షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన దానికి అనుగుణంగా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ డబ్బింగ్ పనులు స్టార్ట్ చేశారు.ఇప్పటివరకూ కనిపించని సరికొత్త రూపంలో ఆది ఈ సినిమాలో కనిపించనున్నారు. ఆయన జోడీగా సురభి నటిస్తోన్న ఈ చిత్రంలో మరో నాయిక పాత్రను రాశీ సింగ్ పోషిస్తున్నారు. ఒక పాట మినహా సినిమా షూటింగ్ అంతా పూర్తయింది. ఆ పాటను కూడా మూడు రోజుల్లో పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'శశి' సినిమాకు అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తుండగా, అమర్‌నాథ్ బొమ్మిరెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.ఆది సాయికుమార్, సురభి, రాశీ సింగ్, వెన్నెల కిశోర్, తులసి, జయప్రకాష్, రాజీవ్ కనకాల, అజయ్, వైవా హర్ష, సుదర్శన్, స్వప్నిక, శిరీష, శరణ్య, హర్ష, మహేష్, కృష్ణతేజ, భద్రం, వేణుగోపాలరావు తదితరులు నటిస్తున్న

# ముద్దులు, కౌగిలింతలా.. అమ్మో..

తెలుగు రాష్ట్రాల్లో సినిమా షూటింగులకి అనుమతులు వచ్చిన సంగతి తెలిసిందే. గత ముడు నెలలుగా సినిమా షూటింగులు లేక ఇబ్బంది పడిన వారందరికీ ఈ వార్త ఎంతో ఊరటని కలిగించింది. అనుమతులు రావడంతోనే అప్పటి వరకూ ఆగిపోయిన సీరియల్స్, సినిమా, టెలివిజన్ కి సంబంధించిన షూటింగులు స్టార్ట్ అయ్యాయి. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం భౌతిక దూరం పాటిస్తూ చిత్రీకరణ జరుపుకుంటున్నాయి.అయితే కరోనా సమయంలో సినిమా షూటింగులకి పెద్ద ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా నటీనటులు ఒకానొక విషయంలో ఆందోళనకి గురవుతున్నారు. షూటింగ్ అన్నాక మరీ అంటీముట్టనట్టు ఉన్నా కూడా కుదరదు. స్క్రిప్ట ప్రకారం కొన్ని చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడు అదే అందరికీ భయంగా మారింది. కరోనా రోజు రోజుకీ పెరిగిపోతున్న నేపథ్యంలో ఎప్పుడు ఏమవుతుందో తెలియట్లేదు. అందుకే షూటింగులు చేస్తున్నా కూడా ఆందోళన మాత్రం తగ్గట్లేదట.ఈ నేపథ్యంలో రెజీనా కెసాంద్రా తన భయాన్ని బయటపెట్టింది. కరోనా టైమ్ లో ముద్దు సీన్లు, కౌగిలింతల సీన్లు చేయాలంటే భయంగా ఉందని, అలాంటి సీన్లు చేయడం ఇప్పట్లో కష్టమని చెబుతోంది. సాధారణంగా ఇలాంటి సీన్లు సినిమాల్లో సర్వసాధారణమే అయినా కరోనా కారణంగా ప్రాణాలని హాని కలుగుతుందేమోనన్న భయమే ఎక్కువగా ఉందని చెబుతోంది. ఏదేమైనా కరోనా వైరస్ తర్వాత సినిమా కథల్లోనూ మార్పులు చేసుకోవాల్సిందేనేమో..!



# తమన్నాకి గట్టిగానే ఇస్తున్నారుగా..!



ప్రస్తుతం ఓటీటీ హవా జోరుగా ఉంది. థియేటర్స్ లాక్‌డౌన్ నడుస్తుంది కాబట్టి.. అందరూ ఓటీటీల మీదే పడ్డారు. అందుకే ఇప్పుడు అందరూ ఓటీటీలను లైం టైం లోకి తేవడానికి నానా కష్టాలు పడుతున్నారు. ఓటీటీల హవా పెరుగుతుంది అనుకున్న అల్లు అరవింద్ కరోనా కన్నా ముందే ఆహా అంటూ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ని మొదలుపెట్టాడు. అయితే అమెజాన్, నెట్ ఫ్లిక్స్, హాట్ స్టార్ లాంటి వాటి ముందు ఆహా ఓటిటి ప్లాట్ ఫామ్... ఓహో అన్నట్టుగా మిగిలిపోవడంతో.. ప్రస్తుతం ఓటీటీస్ కి ఉన్న క్రేజ్‌తో అల్లు అరవింద్ ఆహా మీద క్రేజ్ తెచ్చే ప్లాన్స్ సిద్ధం చేస్తున్నాడు. దాదాపుగా 80 కోట్లు పెట్టిన అరవింద్ అండ్ బ్యాచ్ ఇంకా పెట్టుబడిని ఆహాకి ఎక్కిస్తూనే ఉన్నారు. అయినా లాభాలు మాత్రం ఇప్పుడప్పుడే వచ్చేలా కనిపించకపోవడంతో.. ఆహాని భారీగా ప్రమోట్ చెయ్యాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే ఆహాకి విజయ్ దేవరకొండని బ్రాండ్ అంబాసిడర్‌గా చేసిన అరవింద్.. ఇప్పుడు ఆహా ప్రమోషన్స్‌కి తమన్నాని దించుతున్నాడు. తమన్నా హోస్ట్‌గా ఆహా నుండి ఓ షో రాబోతుంది. అందులో తమన్నా హోస్ట్‌గా సెలబ్రిటీస్‌ని ప్రశ్నలడుగుతూ ఆహాని ప్రమోట్ చేస్తూ ఆ షోని ఆడిస్తుంది. అయితే తమన్నా లాంటి క్రేజీ హీరోయిన్‌ని తీసుకుని ఆహాని ఆహా అన్న రేంజ్ లో ప్రమోట్ చేయించే ప్లాన్స్ లో భాగంగా తమన్నా కి భారీగానే ముట్ట జెబుతున్నారట. హీరోయిన్స్ ఆఫర్స్ తగ్గినా.. ఐటెం సాంగ్స్ తోనో మారేదన్నా అవకాశాలతోనో రెచ్చిపోతున్న తమన్నాకి ఆహా కి హోస్ట్ చేసినందుకుగాను... ఒక్కో ఎపిసోడ్ కి 8 నుండి 10 లక్షల పారితోషకం ఇవ్వబోతున్నారని టాక్. వారానికి ఓ ఎపిసోడ్ చొప్పున.. తమన్నాతో ఇలాంటి ఎపిసోడ్స్ నెలకి ఐదారు చేయించాలని చూస్తున్నారట. మరి ఆ లెక్కన నెలకు ఐదు వేసుకున్న తమన్నాకి 50 లక్షలు ముడతాయన్నమాట,. ఇక తమన్నా షో ని కేవలం ఆహా ప్లాట్‌ఫామ్ మీద నుండే కాకుండా ఓ టీవీ ఛానల్ లోను ప్రసారం చేస్తారని తెలుస్తుంది.

# వాళ్లకంటే బాగా నటించాలనుకుంటా!



"చిత్ర పరిశ్రమలోనే కాదు.. ఏ రంగంలోనైనా సరే చక్కటి ఆరోగ్య కరమైన పోటీ వాతావరణం ఉన్నప్పుడే మనల్ని మనం సరికొత్తగా నిరూపించుకోగలుగుతాం" అంటోంది నభా నటేష్. 'నన్ను దోచుకుందువటే' చిత్రంతో సినీప్రియుల మదిని గెలుచుకున్న నభా.. 'ఇస్మార్ట్ శంకర్'తో మంచి విజయం అందుకుంది. ఆ తర్వాత రవితేజతో 'డిస్కోరాజా'లో ఆడిపాడింది. సినీ పరిశ్రమలో నాయికల మధ్య పోటీ వాతావరణం ఎలా ఉంటుంది? దాని వల్ల ఒత్తిడికి గురవుతుంటారా?అంటే... పోటీ వాతావరణాన్ని తానెప్పుడూ ఇష్టపడతానని చెప్పింది. "పోటీ ఉన్నప్పుడే కదా.. మనల్ని మనం మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి అవకాశం దొరికేది. పరిశ్రమలో నాయికల మధ్యనే అని కాదు ప్రతి నటీనటులకీ మధ్య పోటీ ఉండటం సహజమే. ఒకరకంగా ఈ వాతావరణం వల్ల మనం అవతల వారి నుంచి మరిన్ని కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దొరుకుతుంది. నా తొలి చిత్రం నుంచి ఇప్పటి వరకు నేను వేరే హీరోయిన్స్ సినిమాలు చూసి నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. తెరపై వాళ్ల నటనను చూస్తున్నప్పుడు నేను వాళ్లకంటే బాగా నటించాలి అని అనుకుంటా" అని చెప్పింది నభా. ప్రస్తుతం ఈ భామ 'సోలో బ్రతుకే సో బెటర్' చిత్రంలో నటిస్తోంది.

# పూజా కాదు.. రష్మిక సార్ రష్మిక అంతే..!

ప్రస్తుతం టాలీవుడ్‌లో పూజా హెగ్డే – రష్మికలు నువ్వా నేనా అన్న రేంజ్ లో దూసుకుపోతున్నారు. ఎవరైనా హీరో సినిమా మొదలెడితే పూజా హెగ్డే నా, రష్మికానా అని ఆలోచించే స్థితిలో ఈ ఇద్దరు భామలు ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి మహేష్‌తో రష్మిక – అల్లు అర్జున్‌తో పూజా హెగ్డే జత కట్టారు. అలాగే పూజా హెగ్డే ప్రభాస్‌తో రాధేశ్యామ్ అంటూ పాన్ ఇండియా మూవీలో నటిస్తుంటే.. రష్మిక అల్లు అర్జున్‌తో పుష్ప సినిమాతో పాన్ ఇండియా మూవీ చేయబోతుంది. అయితే రష్మిక ప్రస్తుతం ఫుల్ డిమాండ్ ఉన్న హీరోయిన్. అలాగే పూజా హెగ్డే కూడా అంతే. ప్రస్తుతం వీళ్ళ చేతుల్లో రెండు మూడు సినిమాలున్నాయి. అయితే పూజా హెగ్డే మాత్రం యంగ్ హీరోలైనా, స్టార్ హీరోలైనా తన పాత్రకి ప్రాధాన్యత ఉంటే ఒప్పేసుకుంటుంది. కానీ రష్మిక అలా కాదు.. తనకి స్టార్ హీరోల ఛాన్స్ అయితేనే తన దగ్గరకి తెమ్మని తన మేనేజర్‌కి చెబుతుందట. ప్రస్తుతం లెవల్ మారింది. అందుకే ఇద్దరు హీరోయిన్స్ ఆఫర్ అయినా.. చిన్న హీరోల ఆఫర్ అయినా తన దగ్గర వరకు తేవొద్దని, కేవలం స్టార్ ఛాన్స్ ఉంటేనే రమ్మని చెబుతున్నదట. ఇంతకు ముందు నాని 'శ్యామ్ సింగరాయ్' సినిమాలో రష్మికకి సెకండ్ హీరోయిన్ పాత్ర వస్తే రిజెక్ట్ చేసింది అని న్యూస్ విషయంలోనే రష్మిక ఇలా మార్గదర్శకాలు పాస్ చేసిందట. ఇలాంటి వార్తల వలన తన ఇమేజ్ డ్యామేజ్ అవుతుంది.. అందుకే అలాంటి ఆఫర్ విషయంలో తనదాకా తేవొద్దని తన మేనేజర్‌కి స్ట్రిట్‌గా ఆర్డర్స్ పాస్ చేసిందట.



## అలీ హీరోగా నటిస్తోన్న 53వ చిత్రమిదే..!



అలీ, నియా హీరో హీరోయిన్లుగా రవికుమార్ సమర్పణలో మూకాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వి.బాల నాగేశ్వర రావు దర్శకత్వంలో వి.నాగేశ్వరరావు, సూర్యవంతరం, ఎం.ఎన్.యు.సుధాకర్ నిర్మిస్తోన్న చిత్రం 'మా గంగానది'. 'అంత పవిత్రమైనది స్త్రీ' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో అలీ కుమార్తె బేబీ జువేరియా నటించడం విశేషం. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో అలీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరో అలీ, డైరెక్టర్ వి.బాల నాగేశ్వరరావు, నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో అలీ మాట్లాడుతూ.. "మా గంగానది చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. సాధారణంగా మనం నటించిన సినిమా టీజర్, ట్రైలర్‌ను మరొకరిచేత విడుదల చేయిస్తుంటాం. కానీ కరోనా వల్ల అందరూ సామాజిక దూరం పాటించాల్సి వస్తుంది. అందుకని నా సినిమా ట్రైలర్‌ను నేనే గెస్ట్‌గా మారి విడుదల చేస్తున్నాను. సినిమాలో తొలిసారి సీరియస్ పాత్ర చేశాను. ఇందులో నా కుమార్తె పాత్రలో నా కూతురు జువేరియా నటించింది. జువేరియాలను స్క్రీన్‌పై చూడాలనేది వాళ్ల అమ్మ ఆశ.

## 'బంగారు బుల్లోడు' టీజర్ కూడా రెడీ!



జూన్ 30 అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 'నాంది' సినిమా నుంచి ఎఫ్ఐఆర్ పేరుతో ఫస్ట్ ఇంపాక్ట్ రివీల్ అంటూ ఒక చిన్న గ్లింప్స్‌ను విడుదల చేస్తున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటిం చింది. ఆ సినిమాకు సంబంధించి విడుదలైన అల్లరి నరేష్ పోస్టర్‌తో 'నాంది' చాలా వైవిధ్యంగా ఉండబోతుందనేది అర్థమైంది. ఇక అల్లరోడి పుట్టినరోజు కానుకగా ఆయన నటించిన మరో చిత్రం నుంచి కూడా టీజర్ విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించారు. నందమూరి బాలకృష్ణ నటించిన సూపర్ హిట్ చిత్రం 'బంగారు బుల్లోడు'. ఇప్పుడీ టైటిల్‌తో అల్లరి నరేష్ ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఏ టీవీ సమర్పణలో ఏ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై పి.వి.గిరి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. అల్లరి నరేష్ నటిస్తోన్న 55వ చిత్రమిది. ఈ చిత్రం నుంచి జూన్ 30 అల్లరి నరేష్ బర్త్‌డే కానుకగా టీజర్‌ను విడుదల చేస్తున్నట్లుగా చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. టీజర్‌ను జూన్ 30న సాయంత్రం 4గంటల 05 నిమిషాలకు విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన పూజా జవేరి హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం త్వరలో ఓటీటీలో విడుదలకానుందనే వార్తలు ఈ మధ్య వినిపిస్తున్నాయి.

# జగపతిబాబు జోరు తగ్గలేదు కానీ.. !!

చాలా కాలం తర్వాత 'లెజెండ్' మూవీతో జగపతిబాబు కెరీర్ స్పీడ్ అందుకుంది. అంతకు ముందు హీరోగా ఆయన క్లిష్ట స్థితిలో ఉన్నాడు. ఒకదాని తర్వాత ఒకటిగా ఆయన సినిమాలు ప్రేక్షకుల తిరస్కారానికి గురవుతూ వచ్చాయి. ఆ పరిస్థితుల్లో బోయపాటి శ్రీను డైరెక్ట్ చేసిన 'లెజెండ్'.. ఆయన కెరీర్ దశ, దిశ.. రెండింటినీ మార్చేసింది. జితేంద్ర అనే కరడుకట్టిన కిరాతకుడి క్యారెక్టర్‌లో బాలకృష్ణకు సరైన విలన్ అనిపించాడు జగపతిబాబు. ఆ సినిమా తర్వాత నుంచీ ఒకవైపు విలన్‌గా, మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తూ, చేతినిండా సినిమా ఆఫర్లతో బిజీ అయిపోయాడు. హీరోగా ఎప్పుడూ లక్షల్లోనే రెమ్యూనరేషన్ అందుకుంటూ వచ్చిన ఆయన లెజెండ్‌లో విలన్ రోల్ చేయడం కోసం కోటి రూపాయలు అందుకొని శభాష్ అనిపించాడు. నాన్నకు ప్రేమతో, జయ జానకి నాయక, రంగస్థలం, నేల టిక్కెట్టు, సాక్ష్యం, అరవింద సమేత వీరరాఘవ, మహర్షి వంటి చిత్రాల్లో విలన్‌గా తన ప్రతిభా పాటవాల్ని ప్రదర్శించాడు.వాటితో పాటే హీరో లేదా హీరోయిన్ ఫాదర్‌గా మంచి పాత్రలనూ ఆయన చేశాడు. అయితే మహేష్ సినిమా 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో విలన్ క్యారెక్టర్ తప్పిపోవడం ఆయనకు పెద్ద షాక్. మూడు నాలుగు రోజులు షూటింగ్‌లోనూ పాల్గొన్నాక.. ఆయనను తప్పించి, ఆ క్యారెక్టర్‌ను ప్రకాష్‌రాజ్‌తో చేయించారు నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ విషయాన్ని బహిర్గతం చేసి, బాహాటంగానే తన ఆవేదనను వ్యక్తం చేశాడు జగపతి. ప్రకాష్‌రాజ్ స్వయంగా కోరడం వల్లే జగపతిని తప్పించి, ఆయనను తీసుకున్నారని తర్వాత



కథనాలు వచ్చాయి. అది గతం.. ఆశ్చర్యకరంగా జగపతిబాబుకు 'సరిలేరు నీకెవ్వరు' సినిమా తప్పిపోయిన దగ్గర్నుంచీ ఇంతదాకా మరో భారీ సినిమాలో అవకాశం రాలేదు. నానితో 'వి', 'టక్ జగదీష్', కీర్తి సురేష్‌తో 'మిస్ ఇండియా', 'గుడ్‌లక్ సఖి', మహేష్ మేనల్లుడు అశోక్ గల్లా పరిచయ చిత్రం వంటి సినిమాలే ఆయన చేస్తున్నాడు. అలాగే ఇతర భాషా సినిమాలూ ఆయన చేస్తున్నాడు. కన్నడంలో 'పొగరు', 'రాబర్ట్', తమిళంలో విజయ్ సేతుపతి సినిమా 'లాబమ్'లో విలన్ రోల్స్ చేస్తున్నాడు జగపతి. చేతిలో అరడజను సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ ప్రస్తుతం టాలీవుడ్‌లో నిర్మాణంలో ఉన్న ఏ ఒక్క భారీ సినిమాలోనూ ఆయన నటిస్తున్న జాడ కనిపించడం లేదు. ఆర్ఆర్ఆర్, ఆచార్య, రాధేశ్యామ్, పుష్ప, వకీల్ సాబ్, విరూపాక్ష, నారప్ప, బీబీ3 తదితర చిత్రాలలో ఏ ఒక్కదానిలోనూ ఆయన నటించడం లేదు. హీరోగా డిమాండ్ లేకపోయినా విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనలోని వెర్సటాలిటీని ప్రదర్శిస్తూ జోరు చూపించిన మన జగపతిబాబును భారీ సినిమాల దర్శకులూ, నిర్మాతలూ ఉపేక్షించడం సరికాదని ఫిల్మ్‌నగర్ జనాలు అభిప్రాయపడుతున్నారు.

# తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప




## కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలి
### జిల్లా రెవెన్యూ అధికారి మాలోల



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 14 :** ఈ నెల 15, 16 తేదీలలో జరుగనున్న ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో ప్రభుత్వ లెక్చరర్స్ పోస్టుకు నియామకాల పరీక్షల ను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్ నందు ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ లెక్చరర్స్ పోస్టుకు నియామకాలకు పరీక్షల ఏర్పాట్ల పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ లెక్చరర్స్ పోస్టుకు నియామకాలకు పరీక్షలు ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ పరీక్షలకు జిల్లా నుండి 442 మంది హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షలు జిల్లాలో అన్నమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నిలజీ అండ్ సైన్స్‌స్, కడప, సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రొద్దుటూరు, ఎస్ వి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కడప, శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నిలజీ, కడప 4 (నాలుగు) పరీక్ష కేంద్రాలలో నిర్వహించడం జరుగుతోంద న్నారు. కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలన్నారు. సదరు పరీక్షలు ఉదయం దఫా 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యా హ్నం దఫా 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంద న్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే రావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురా కూడదన్నారు. అందుకు సంబంధిత అధికారులు తనిఖీ చేసి అనుమతించాల న్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి గంగయ్య, ఏ పి పి ఎస్ సి సెక్షన్ ఆఫీసర్లు వసంత కుమార్, ప్రశాంత్ కుమార్, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెంటెంట్లు, అధికారులు, పాల్గొన్నారు.

## హామీలను అమలుపరచిన ఘనత వైసిపిదే



**చిత్తూరు, వార్తావళి, సెప్టెంబర్ 14 :** ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రజలకు ఇచ్చిన హామీలను దాదాపుగా అమలుపరిచిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే చెందుతుందని ప్రపంచమంతా కరోనాతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు అన్నారు. బంగారు పాళ్యం మండలం బోరబండ లో నేడు వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీవో తాసిల్దారు పలువురు విచ్చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల తో పాటు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని ముఖ్యంగా మహిళల కోసం వై ఎస్ ఆర్ భరోసా విద్యాభివృద్ధి కోసం తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం తో పాటు ఎన్నికలు జరిగే నాటికి మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తాం అని ఇచ్చిన హామీని విడతలవారీగా అమలు చేయడానికి వైయస్సార్ ఆసరా పథకం ఈనెల 11న ప్రారంభించారని గ్రామాల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఆ గ్రామంలో ఎన్ని సంఘాలు ఉన్నాయి ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారని తెలుసుకోవడానికి గ్రామస్థాయిలో పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

## సమస్యలు విన్నవించు కోవడానికి అనుమతివ్వండి



**రైల్వేకోడూరు, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కడప జిల్లా, ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీలోని ఆంధ్ర ప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థచీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి కి భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగంపేట గ్రామ సమస్యలు తీర్చాలని మా యొక్క సమస్యలను విన్నవించు కోవడానికి ఏపీఎండీసీ ఎండి హరినారాయణ్ గారు మాకు అపాయింట్మెంట్ ఇవ్వవలసింది గా వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ యువనేత తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూజులై నెలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఎండీసీ ఎండి హరి నారాయణ గారు మంగంపేట గ్రామ సమస్య లను మాతో చర్చించడం జరిగిందని ఈ కాన్ఫరెన్స్‌లో మీ యొక్క సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది. మంగంపేట గ్రామ ప్రజలు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఈ గ్రామ సమస్యలను పరిష్క రించే విధంగా కృషి చేయాలని ఇందుకుగాను మాకు ఎండి గారితో నేరుగా మాట్లాడడానికి అనుమతి ఇప్పించవలసిందిగా చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని త్వరలోనే మాకు అనుమతి ఇప్పించి,మా సమస్యలు ను పరిష్క రించే విధంగా సహాయ పడాలని కోరామని భరత్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య,రమణ,రాముడు, వెంకటేశు,మొక్కట్ల సుబ్బమ్మ, సుమ, బత్తల వెంకట సుబ్బమ్మ, ఇందిరమ్మ, సుబ్బమ్మ, వెంకటమ్మ, నారాయణమ్మ మరియు మంగం పేట గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## వై.యస్.ఆర్.ఆసరా ప్రతి కుటుంబానికి ఆసరా
### తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గిరీష




**తిరుపతి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** వై.ఎస్.ఆర్. వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం నాడు నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలోని లలిత కళా ప్రాంగణం లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ గిరీష, అధికారులు, స్వయం సహాయక సంఘాల ఆడపడుచులు, వై.యస్.ఆర్. పార్టీ నాయకులు పాల్గొని, వై.యస్.ఆర్. ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. తిరుపతి శాసనసభ్యులు భూమన మాట్లాడుతూ జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని, వైయస్సార్ ఆసరా వారోత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషమని, గతంలో స్వయం సహాయక సంఘాల లో ఉన్న మహిళల ఆర్థిక ఇబ్బందులను వై.యస్. జగన్మోహన్ రెడ్డి గారు ఏప్రిల్ 2019 లో అక్క చెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల బ్యాంకు రుణాలు మొత్తం నాలుగు దఫాలుగా నేరుగా మీ సంఘం పొదుపు ఖాతా కి జమ చేస్తామని తెలియజేశారు, మాట ప్రకారం ప్రతి ఒక్క అక్క చెల్లెమ్మలకు వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారితోపాటు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గిరీష, అదనపు కమిషనర్ హరిత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, మెప్మా రమణ, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, వై.ఎస్.ఆర్. సి పి నాయకులు ఎస్ కె బాబు, శంకర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నరసింహాచారి, అజయ్, రాజేంద్ర, భరణి, కుసుమ కుమారి, శ్రీదేవి, ఆర్ పి లు, మహిళలు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ



**శ్రీకాళహస్తి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** ప్రధానమంత్రి వర్యులు శ్రీ నరేంద్రమోదీ గారి 70 వ జన్మదినోత్సవాన్ని పురస్క రించుకుని ఈ నెల 14 నుండి 20 వ తేది వరకు, భారతీయ జనతా పార్టీ దేశవ్యా ప్తంగా నిర్వహిస్తున్న సేవా వారోత్సవాలలో భాగంగా, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, శ్రీ కోలా ఆనంద కుమార్ గారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి నియో జకవర్గంలోని ఏర్పేడు నందు ఉన్న లెప్రసి ఆసుపత్రి నందు మండల నాయకులు, కార్యక ర్తలతో కలిసి రోగులకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు అందివ్వటం జరిగింది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ గారు మాట్లాడుతూ 2014 సంవ త్సరం నుండి మన ప్రియతమ ప్రధానమంత్రి వర్యులు శ్రీ నరేంద్రమోదీ గారి జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని సేవా వారోత్సవాల పేరిట వారం రోజుల పాటు అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నా మన్నారు. అందులో భాగంగా ఈరోజు ఏర్పేడు మండలంలోని, ఏర్పేడు గ్రామం నందు ఉన్న లెప్రసి ఆసుపత్రి నందు ఉన్న కుష్టు రోగులకు,ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులకు ఇలా పండ్లను అందించే కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ సేవా కార్య క్రమంలో మండల నాయకులు, కార్యకర్తలం దరూ ఇలా పాలుపంచుకోవటం సంతోషంగా ఉందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ వారం రోజుల పాటు వివిధ రకాల సేవా కార్య క్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సేవా వారోత్సవాల నియోజకవర్గ ఇంఛార్జి మేళాగారం సుబ్రమ ణ్యం రెడ్డి, మం డల అధ్యక్షులు గాండ్ల శివ కుమార్, నాయకులు బాలిశెట్టి చంద్ర శేఖర్,కుప్ప ప్రసాద్ కుమార్,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు కాసరం రమేష్,ఏర్పేడు మండల నాయకులు రావిళ్ళ హేమంత్ నాయుడు, తిరుమలశెట్టి నరేశ్, వెంకటగిరి హరి,రాజా, గురునాథం, చెంచుముని, నవీన్,సుబ్బారెడ్డి, మునిస్వామి రెడ్డి, దుర్గాప్రసాద్,సి సుబ్రహ్మ ణ్యం రెడ్డి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపజేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ
### బిజెపి కి.మో. రాష్ట్ర అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డి



**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 14:** ప్రపంచంలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమ డింపజేస్తూ,ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా గత ఆరు సంవత్సరాలుగా పరిపాలన చేయడం ఒక్క ప్రధాని నరేంద్ర మోదీ కే సాధ్య మని బిజెపి కిసాన్ మోర్చారాష్ట్ర అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డి,రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీగారి 70వ పుట్టిన రోజు పురస్కరించుకొని దేశవ్యా ప్తంగా సేవా సప్తాహం-2020 పేరుతో వారం రోజుల పాటువివిధ రకాల సేవా కార్య క్రమాలు బిజెపి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం కడప జిల్లా రాజంపేట మండలంలోని బోయినపల్లి దళితవాడ, వెంకటంపల్లి హరిజనవాడలో పండ్లు, మాస్కులు, కోడిగుడ్లు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారి 70వ పుట్టిన రోజు సందర్భంగా బిజెపి జాతీయ నాయకత్వం వారం రోజుల పాటు పేద ప్రజలకు, వికలాంగులకు సేవ, చెట్లు నాటడం, రక్త దానాలు చేయడం స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా మంచి శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పట్టుపో గుల ఆదినారాయణ ,పట్టణ అధ్యక్షులు ఎం. వెంకట సుబ్బానాయుడు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయేంద్ర బాబు,మండల అధ్యక్షు రాలు డి. ప్రభావతి ,మహిళా నాయకురాలు కళావతి, మాజీ మండల అధ్యక్షుడు పి .పాపయ్య, మండల ప్రధాన కార్యదర్శి రేణు ప్రసాద్, రమణయ్య ,సుబ్రమణ్యం ,రాజు పాల్గొన్నారు

## అర్హులందరికీ వైయస్సార్ చేయూత అందేలా చూడండి



**సత్యవేడు, వార్తావళి, సెప్టెంబర్ 14 :** మండలంలో అర్హులందరికీ వైయస్సార్ చేయూత పథకం వర్తించేలా చూడాలని వైసీపీ నేతలు పలువురు ఎంపీడీవో ఉమాలక్ష్మికి వినతి అందించారు. సోమవారం చిత్తూరు జిల్లా సత్యవేడు మండల పరిషత్ కార్యాల యంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బాలాజీ రెడ్డి, మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి తదితరులు ఎంపీడీవోను కలిసి వినతి సమర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నేత బాలాజీ రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ చేయూత పథకం లో గుర్తించిన అర్హులందరికీ గత నెలలో 18 వేల 750 రూపాయలు సొమ్మును వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అయితే ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న కొందరు అనర్హులుగా అధికారులు ప్రకటించారన్నారు. ముఖ్యంగా వయసు 45 నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న మహిళలందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. అయితే సాగు భూ ములు అధికంగా ఉండడం, వయసులో తేడా, 300 యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ విని యోగం, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడం తదితర కారణాలతో దరఖాస్తు చేసుకున్న అందరూ అనర్హులుగా తేలినట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు అధికారులు చొరవ చూపి అర్హులు నష్టపోకుండా చూడాల న్నారు. దీనిపై ఎంపీడీవో ఉమాలక్ష్మి స్పందిస్తూ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి సురేంద్ర నాథ్ ఉన్నారు.

## కోవిడ్ వ్యాధి వ్యాప్తిని అరికట్టాలంటే కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలి



**చిత్తూరు, వార్తావళి, సెప్టెంబర్ 14 :** చిత్తూరు, ఎడమాలజీ సూత్రాల ప్రకారం కోవిడ్ వ్యాధి వ్యాప్తిని అరికట్టాలంటే ఖచ్చితంగా కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ కె. భాస్కర్ పేర్కొనారు. సోమవారం స్థానిక జిల్లా సచివాలయంలో అమరావతి నుండి ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ కరోనా వైరస్ నివారణ చర్యల్లో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తల పై వివిధ జిల్లాలలోని జిల్లా జాయింట్ కలెక్టర్లు, డిఎంహెచ్ఓ లు, డిసిహెచ్ఎస్ లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ మాట్లాడుతూ కాంటాక్ట్ ట్రేసింగ్ చేయుటకు 2 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి 14 రోజులకు ఒక బృందం చేత సర్వే చేసే బాధ్యత వైద్యాధికారుల పై ఉందన్నారు. ప్రతి కోవిడ్ పాజిటివ్ కేసుకు 21 మందిని కాంటాక్ట్ కేసులుగా గుర్తించాలని తెలిపారు. ప్రతి కోవిడ్ పాజిటివ్ కేసును 24 గం . లోపు ఏదో ఒక కంటైన్మెంట్ జోన్ కు మ్యాపింగ్ చేసి కాంటాక్ట్ కేసులను గుర్తించాలన్నారు. ప్రతి కరోనా పాజిటివ్ కేసును 48 గం. ల లోపు ట్రయాజ్ కేంద్రాలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి ఏ దో ఒక కోవిడ్ ఆసుపత్రికి కానీ లేదా హెూమ్ ఐసోలేషన్ కు కానీ తరలించాలన్నది ఒక ఖచ్చితమైన కోవిడ్ నిబంధనగా భావించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి డి ఎం అండ్ హెచ్ ఓ డా. పెంచలయ్య, డి సి హెచ్ ఎస్ డా. సరళమ్మ, చిత్తూరు నుండి పిఓ డిటిటి డా. రమాదేవి, డిఎస్ఓ డా. సుదర్శన్, పాల్గొన్నారు.

## ఏపి ఆయిల్ ఫెడ్ కే మీ దిగుబడి అందించండి
### కొఠారు రామచంద్ర రావు

ఆయిల్ పామ్ రైతులకి ఏ పి ఆయిల్ ఫెడరేషన్ శుభ వార్త తెలిపింది. ప్రభుత్వం నుండి ఫిక్సడ్ ధరల నిర్ణయంలో జాప్యం జరుగుతూ ఉండడం కారణంగా, ఏ పి ఆయిల్ ఫెడరేషన్ ఫార్మర్స్ కమిటీ ఛైర్మన్ శ్రీ కొఠారు రామచంద్ర రావు గారు, వైస్ ఛైర్మన్ మరియు ఎం డి శ్రీ శ్రీకాంత్ నాథ్ రెడ్డి గారు, ఏ పి ఆయిల్ ఫెడ్ పెదవేగి ప్లాంట్ ఇంచార్జ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి గారు మరియు ఫార్మర్స్ కమిటీ సభ్యులు రైతులకు, మెరుగైన ధరలు అందించాలని ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఒక టన్ను పంట (ఎఫ్ ఎఫ్ బి) కు రూ 11000/- మరియు అదనంగా రవాణా ఛార్జీలు ఇచ్చేట్లు ధరను నిర్ణయిచడం జరిగిందని, కొత్త ధరలు రేపటి నుండే అమలులోకి వస్తాయని శ్రీ రామచంద్ర రావు గారు తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారి దిశానిర్దేశంలో, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కురసాల కన్నబాబు గారి సూచనలతో ప్రభుత్వ యంత్రాగం మరింత ఆకర్షణీయమైన కొత్త ఫిక్సెడ్ కొనుగోలు ధర నిర్ణయించేందుకు కసరత్తులు ప్రారంభించిందని, త్వరలో అది ప్రకటించనున్నారని శ్రీ రామచంద్ర రావు గారు వెల్లడించారు. రైతులు ఇక పై ప్రైవేట్ వారికి తమ పంటను అప్పగించకుండా ఏ పి ఆయిల్ ఫెడ్ వారికే తమ దిగుబడి అందించాలని ఆయన సూచించారు.

## 'ఉదయగిరి వాసికి అంతర్జాతీయ అవార్డు'



**ఉదయగిరి, సెప్టెంబర్ 14 వార్తావళి:** నెల్లూరు జిల్లా ఉదయ గిరికి చెందిన డాక్టర్.యస్. యమ్. బాషాకు "విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్" నదు చోటు దక్కింది. అంతర్జాతీయ స్థాయి అవార్డు ను సొంతం చేసుకున్నారు. విద్యార్థి యువజన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొ న్న బాషా ప్రజా వైద్యుడిగా ఉదయగిరి నియోజకవర్గానికి చిరపరిచితుడే. తొంభై వ దశకంలో అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్ కె రాజు పిలుపు తో సారా వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొని చిన్నాగంపల్లి నుంచి దూబగుంట వరకూ జరిగిన సారా వ్యతిరేక పాదయాత్రకు నాయకత్వం వహించారు. ముప్పై ఏళ్ల క్రితమే వెనుకబడ్డ ఉదయగిరి నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని తన ప్రజా వైద్యశాలలో ఉచితంగా అందించి తన మానవీయ సేవా తత్వాన్ని చాటుకున్నారు. 1994 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ మంత్రి మాదాల జానకిరాం తో పోటీపడి ఓడినా బిజెపి అభ్యర్థి కంటే అత్యధిక ఓట్లు సాధించి పత్రికల్లో పతాక శీర్షికల్లోచర్చనీయాంశమయారు. నెల్లూరు జిల్లా జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లాలోని అనేక వెనుకబడ్డ మారుమూల ప్రాంతాల్లో ఉచిత (స్సుపర్స్పెషాలిటీ) వైద్య శిబిరాలు నిర్వహించి అధికార అనధికార ప్రముఖుల ప్రశంసలు పొందారు. జిల్లా కలెక్టరుతో సహా జిల్లా ఉన్నతాధికారులను భాగస్వామ్యులు చేశారు. ఉదయగిరిలో జరిగిన ఒక సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాని ప్రారంభించిన నాటి కలెక్టర్ బి రాజశేఖర్ ప్రత్యేకంగా బాషా ను అభినందిస్తూ ఓ డాక్టర్ ..సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టు అయితే మానవీయ కోణం ఆవిష్కృతమవుతుందని ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో విశ్వగురువు మేనేజింగ్ డైరెక్టర్ సత్యవోలు రాంబాబు పాల్గొన్నారు.

## ఎర్రచందం దొంగలుగా మారిన యువత

**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 14:** పెనగలూరు మండలం చక్రంపేట వద్ద ఒక వ్యక్తి దగ్గర నుండి రు.3.53 వేలు దోపిడీ జరిగిందని పెనగలూరు పోలీసులకు ఫిర్యాదు అందింది. దోపిడీ కేసు విచారణకు వెళ్లిన పోలీసులకు జల్సాలకు అలవాటుపడి దారితప్పిన యువత ఎర్రచందం అక్రమ రవాణా చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది .కడప ఎస్పీ అన్బురాజన్,రాజంపేట డీ ఎస్పీ నారాయణ స్వామి రెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట రూరల్ ఇంచార్జి సి.ఐ.హనుమంత్ నాయక్,పెనగలూరు ,పుల్లంపేట ఎస్.ఐ.లు చెన్నకేశవ ,వినోద్ కలిసి 13 మంది నిందితులను అరెస్ట్ చేసి వారివద్ద నుండి 28 ఎర్రచందం దుంగలతో పాటు,రెండు కార్లు,రెండు మోటార్ సైకిళ్లు స్వాదీనం చేసుకున్నారు .పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం ఈ నెల 7 వ తేదీ



ఉదయం చక్రంపేట బ్రాందీ షాప్ సేల్స్ మెన్ పుచ్చకాయలు చినబాబు (23)పై దాడిచేసి గాయపరిచి రు.3.53 వేలు దోపిడీ చేశారని ఫిర్యాదు చేశారు. అది తప్పుడు ఫిర్యాదని పోలీసులు విచారణలో తేలింది .ఇంటర్ వరకు చదువుకున్న చినబాబు రు.2 లక్షలకు మద్యం అక్రమంగా అమ్మి మిత్రులతో కలిసి ఎర్రచందనం కొన్నట్లు తెలిసింది .పెనగలూరు మండలం కొండూరు క్రాస్,పుల్లంపేట మండలం జాగువారిపల్లి కల్లూరి అభిషేక్ రెడ్డి తోటలో దాచి ఉంచిన ఎర్రచందం దుంగలను పోలీస్ రెండు బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. బి.కాం.రెండవ సం.చదువుతున్న కావేరి వంశీ,డిగ్రీ మొదటి సం.చదువుతున్న శాకమూరి కుమార్ చౌదరి, మారె అనిల్ కుమార్,డిగ్రీ చదివిన పునగాని కార్తీక్ కుమార్ ,ధరూరి నాగేశ్వర్,వాహనాలు బాడుగకు తీసుకుని ఎర్రచందనముకు పంపే డ్రైవర్ బాలరాజు వరప్రసాద్,ఆర్మీలో హవల్దారుగా రిటైర్డ్ అయ్యి కోడూరులో కిరాణా షాప్ నడుపుతున్న దాదినేని వేమయ్య,వ్యవసాయం చేసుకునే కోనేటి శ్రీను ,ఎర్రచందనం దుంగలు తెచ్చిన కూలి గాలి రమణయ్య ,అరటి తోట యజమాని కల్లూరి అభిషేక్ రెడ్డి ,ఎర్రచందనం దుంగల వ్యాపారం చేసే గోగుల అశోక్,ఈడిగ శివలను అరెస్ట్ చేసి సోమవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు.




# సంక్షేమం ఇచ్చి ప్రజలపై పన్నుల భారం



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కరోనా కష్టాల పేరిట ప్రజానీకంపై పన్నుల భారం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తుందని శాసనమండలి సభ్యులు శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు తాజాగా సహజవాయువు పై 10 శాతం వ్యాట్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది గతంలో14.5 శాతం వ్యాట్ వుంటే అదనంగా 10 శాతం పెరిగి 24.5 శాతం పెరిగింది దీని మూలంగా రవాణా చార్జీలు పెరిగే అవకాశం ఉంది రాష్ట్రములో కృష్ణా గోదావరి బేసిన్ లో పెద్ద ఎత్తున సహజవాయువు నిల్వలు ఉన్నట్లు అగార్కర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శనివారం అధికారికంగా ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సహజవాయువు పై ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం అని నాగ జగదీష్ తెలిపారు రాష్ట్రంలో సహజవాయువును విద్యుత్ ఉత్పత్తితో పాటు ఆటోలు కార్లు ఆర్టీసీ బస్సులు సహజ వాయువు వినియోగిస్తున్నారు రాష్ట్రంలో నగరాలు పట్టణాల్లో అత్యధిక ఆటోలు సహజ వాయుతోనే నడుస్తున్నాయని నాగ జగదీష్ తెలిపారు ప్రభుత్వ నిర్ణయంతో వీటి రేట్లు ప్రయాణ రేట్లు పెంచక తప్పనిస్థితి ఏర్పడింది దీని ప్రభావం నేరుగా ప్రజల పైన పడు తుందని ఎరువుల తయారీలో కూడా సహజ వాయువును వినియోగిస్తున్నారు ఎరువుల రేట్లు కూడా పెరిగే అవకాశం ఉందని రైతులపై తప్పక భారం పడుతుందని జగదీష్ తెలిపారు గతంలో అమ్మ ఒడి పథకం 15 వేలు వేసి మద్యం ధరలు పెంచి సదర సొమ్ముని లాగేశారని రైతు భరోసా పేన్షన్లు ద్వారా అందించిన సొమ్మును విద్యుత్ ఆర్టీసీ రేట్లు పెంచి లాక్కున్నారని వాహన మిత్ర ద్వారా 10 వేలు ఆటో డ్రైవర్లు ఇచ్చిన సొమ్మును పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి దోచేశారని జగదీష్ విమర్శించారు ఇప్పుడు ఆసరా పథకం ద్వారా ఇచ్చిన సొమ్మును ఇంటి పనులు పెంచి లాక్కోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని జగదీష్ ఆరోపించారు ఆర్భాటంగా ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం గతంలో భూములు అమ్మాలని చెప్పి ఇప్పుడు పన్నులు పెంచడం ధరల పంచడం మార్గం అంటూ అమలు చేస్తున్నారని ఆదాయం సృష్టించకుండా ఇలా సామాన్యులపై భారం వేయడం ఏ విధంగా సమంజసమని జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు ఇప్పటికైనా ప్రజలపై భారం మోపే పనులు మానుకొని ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు.

# రైతే దేశానికి వెన్నుముక



**ఎలమంచిలి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** మునగపాక మండలం, మూలపేట గ్రామంలో ,శ్రీ అమ్మ చారిటబుల్ ట్రస్ట్ :(గాజువాక) వారి ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల అయ్యల నాయుడు అధ్యక్షతన, రైతు దేవోభవ అనే నినాదంతో ,పేద రైతు కుటుంబాలకు సహాయం చేయాలని మరియు వ్యవసాయం లో ఉపయోగపడే పనిముట్లు ఇస్తూ రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతన్నకు మనోధైర్యాన్ని ఇస్తూ జరిగిన కార్యక్రమంలో, రైతు కుటుంబాలకు యూరియా బస్తా, పార, కత్తి ,కొడవలి, దుప్పటి చెప్పులు ,గొడుగు, తదితర వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కృష్ణమూర్తి, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్ ,వైయస్సార్ సిపి పార్టీ యువజన నాయకులు కాండ్రేగుల చందు,తదితరులు ప్రసంగించి , రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది.

# గ్రామీణ ప్రాంత ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తే ప్రభుత్వానికి పతనం తప్పదు'



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కాంగ్రెస్ పార్టీఅధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని మహిళలను ఆర్థికంగా ఆదుకుంటామని హామీలు ఇచ్చి పాద యాత్రలో నవరత్నాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని టిడిపి ప్రభుత్వం ప్రజా, వ్యతిరేక విధానాలను పారద్రోలాలని ఆకర్షణీయమైన వాగ్దానాలు ను నమ్మి ప్రజలు 150మంది ఎమ్మెల్యేలు, 22మంది ఎంపీల ను ఇస్తే అందుకు బహుమతిగా గత ప్రభుత్వం అనుసరించిన ప్రపంచ బ్యాంకు విధానాలను గ్రామీణ ప్రాంత పేద ప్రజల పై యూజర్ చార్జీల పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ఈ ప్రభుత్వ విధానాలను ప్రజలు త్రిప్పికొట్టాలని జిల్లాకార్యదర్శికోన.లక్ష్మణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాజన్న రాజ్యం అని పేరు చెప్పుకుంటూ “”అందరకీ అన్నం పెట్టే రైతన్న కడుపు కొట్టే”” నగదు బదిలీ విధానాన్ని రద్దు చేయాలని పంపు సెట్లకు మీటర్లు పెట్టె విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు.

# కామ్రేడ్ పెంటకోట జగన్నాథం సంస్మరణ సభ



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కామ్రేడ్ పెంటకోట జగన్నాథం గారి సంస్మరణ సభ ఆదివారం కార్మిక కర్షక నిలయంలో ఏ బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది ఈ సభలో సిపిఐజిల్లా నాయకులు వైఎన్.భద్రం,సిపిఎంఎల్ నాయకులుపిఎస్అజయ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రీ అప్పారావు సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ సీపీఐపార్టీనాయకులు నాయడు.మల్లికార్జునరావు,సిపిఎం నాయకులు గంట శ్రీరామ్ పెంటకోట శ్రీనివాస రావు తదితరులు ప్రసంగిస్తూ జగన్నాథం గారి జీవితం ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలకు ఆదర్శప్రాయం ఆయన తుది శ్వాస వరకు శ్రామిక జనుల ప్రయోజనాల కోసం రైతాంగం వ్యవసాయ కార్మికులు కౌలు రైతుల హక్కులకోసం పోరాడారని కొనియాడారు జగన్నాథం గారి చిత్రపటానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి నాయన బాబు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు సభకు హాజరైన వారంతా జగన్నాథం గారి జీవితంలో ఆయన చేసిన ప్రజా పోరాటాలను ఉదాహరణకు ఎరువులు రైతులకు ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయనున్నాడు ప్రభుత్వ గోదాములు బద్దలుకొట్టి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రైతాంగానికి అమ్మిన చరిత్ర రైతు ఉద్యమానికి ఉందని అదేవిధంగా మద్యపాన నిషేధం సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐపార్టీ నాయకులు తాకాశి.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీజిల్లాకార్యదర్శి కోన.లక్ష్మణ,సిపిఎం సత్యనారాయణ శ్రీరామ్ ఎస్ఎఫ్ఐ నాయకులు జి సురేష్ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బు గిడి నూక అప్పారావు కూలీ సంఘం నాయకులు మహేశ్వరరావు సిఐటియు నాయకులు కర్రీ అప్పారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బిజెపి ఎన్డీఏ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ సిపిఐ నిరసన




**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక ,కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అనకాపల్లి కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు 4రోడ్ల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు ఈసందర్భంగా పార్టీజిల్లా నాయకులు వై.ఎన్.భద్రం మాట్లాడుతూ అనేక వాగ్దానాలతో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వం లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సంస్కరణల పేరుతో పెద్ద నోట్ల రద్దు చేసిందన్నారు ఆ వెంటనే దేశమంతా ఒకటే పన్ను పేరుతో జి.ఎస్.టిని ప్రవేశపెట్టి రాష్ట్రాల హక్కులను హరించడమే కాక చిన్న సన్నకారు రైతులు, కార్మికులు, చిరు వ్యాపారస్తులు స్వయం ఉపాధి కూలీలను పొట్టకొట్టిందన్నారు రాష్ట్రాలకు ఉన్న హక్కులను పూర్తిగా హరించి తమ చేతుల్లో తీసుకుని రాష్ట్ర ఆదాయాన్ని గండి కొట్టి తమ చేతుల్లో కీలుబొమ్మగా మార్చిందన్నారు రాష్ట్రాల నుండి పన్నులు నేరుగా తీసుకొని రాష్ట్రాలకు తగిన వాటా ఇవ్వకుండా ఎండగెటుతుందని ఆరోపించారు రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేక తిరిగి వారిపై అధిక పన్నుల భారంవేసి పోలీసులు చేలాఠీఛార్జి చేయించిదన్నారు 44 గా ఉన్న కార్మిక చట్టాలను 4 గా కుదించి కార్మిక హక్కులను కాలరాస్తు కార్పొరేట్ శక్తులకుఉడగొట్టే ఈ విధంగా మారిసిందన్నారు రైల్వే ,ఎల్ఐసి, విమానాశ్రయం,సంస్థ వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేస్తుందన్నారు ఈనేపథ్యంలో ఉపాధి కోల్పోయిన కోట్ల మంది ప్రజలకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవాచేశారు సమాన పనికి సమాన వేతనం అందరికీ ఉపాధి అవకాశాలు ఆర్థిక సమానత్వం కల్పించాలని డిమాండ్ చేశారు మతోన్మాదం చర్యలకు కేంద్ర ప్రభుత్వంవతాస్తు పలకడం దుర్మార్గమన్నారు ప్రజావ్యతిరేక విధానాలను మానుకోకుండా కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు ఉచితవిద్యుత్ కొనసాగించాలని అందరికీ న్యాయం జరిగే విధంగా రాష్ట్రాలకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు శ్రీరామదాసు అబ్బులు, నాయుడు మల్లికార్జునరావు, కోరి బిల్లి శంకర్రావు కొమ్మనాపల్లి వెంకటరమణ, కోన లక్ష్మణ, మత్తూర్తి సూరిబాబు, కొరిబిల్లి . జగదీష్, మంజేటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు నిత్యావసరాలు పంపిణీ



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** అనకాపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయులు మేమున్నాం మీ కోసం అంటూ కరోనా కారణంగా 6 నెలల నుండి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నా ప్రైవేట్ విద్యాసంస్థల టీచర్స్ మరియు లెక్చరర్స్ కు 1లక్ష రూపాయల తో 75 మందికి ఆహార వస్తువుల రూపంలో సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి జోనల్ కమిషనర్ పి శ్రీరామ మూర్తి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించిన ఏ.వి.రామచంద్రరావు ,ఎం ఉమామ హేశ్వరరావు, ఎం శంకర ప్రసాద్,పి నిర్మల గారిని అభినందించారు . పి టి ఎల్ యూ కమిటీ సభ్యులను అభినందించారు ఈ సందర్భంగా పి టి ఎల్ యు రాష్ట్ర అధ్యక్షులు డి అంబేద్కర్ గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది బోధన మరియు బోధనేతర సిబ్బంది ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతుంటే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు గానీ, ప్రభుత్వం గానీ స్పందించని సమయములో మేమున్నాం మీకోసం అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హేమలత గారు, ఓమ్ రామ్ గారూ భారత వికాస్ పరిషత్ ప్రతినిధి గోపాలరావు గారు పి టి ఎల్ యు జిల్లా అధ్యక్షులు కాళ్ల లోకనాథం అనకాపల్లి పార్లమెంటు కన్వీనర్ వేలం నూకరాజు అనకాపల్లి అధ్యక్షులు దాడి భాను అనిల్, ప్రధాన కార్యదర్శి యు బాలాజీ,వెంకటేష్,ఈశ్వరీ శైలజ, రమేష్,సురేష్,నాయడు, భాగ్యలక్ష్మి, శివానంద్, రజిని, శ్రీదేవి,లలిత తదితరులు పాల్గొన్నారు అనంతరము కరోనా జాగ్రత్తలు పాటిస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న టీచర్స్ లెక్చరర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ కు మొత్తము 75 మందికి రేషన్ ముఖ్య అతిథుల ద్వారా అందించారు.

# వాసవి క్లబ్ అధ్యక్షులు వీరభద్రరావుకు సత్కారం



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 14 :** అనకాపల్లి ప్రాంత వాసవి క్లబ్ అధ్యక్షులు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నున్న వీరభద్రరావును ఆదివారం పలు సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి కె వి గౌరీ పతి, బ్రాహ్మణ సంఘ నాయకులు గోపి నంబాల మాధవా చార్యులు, క్షత్రియ సంఘం నాయకులు పెనుమత్స కృష్ణం రాజు, కె సత్యనారాయణ రాజు, వాసవి క్లబ్, విశ్రాంత ఉపా ధ్యాయ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సత్యనారాయణపురం పాఠశాల చైర్మన్ రాము, వైస్ చైర్మన్ పలక దుర్గ పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టుకు అభినందన



**ఢిల్లీ:** ద్విచక్రవాహనంపై వచ్చి తన మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోతున్న ఇద్దరు దొంగల్ని ఓ మహిళా జర్నలిస్ట్ వెంబడించి పట్టుకున్న ఘటన ఢిల్లీలో శనివారం చోటుచేసుకుంది. ఆ మహిళా జర్నలిస్ట్ చూపిన తెగువ, ధైర్యానికి పోలీసులు ఫిదా అయ్యారు. ఆమెను పోలీస్ స్టేషన్‌లో సత్కరించారు. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. దూరదర్శన్‌లో పనిచేస్తోన్న మహిళా జర్నలిస్ట్.. శనివారం మధ్యాహ్నం ఆటోరిక్షాలో దక్షిణ ఢిల్లీలోని మాలవ్యా నగర్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసు కుందని ఈశాన్య ఢిల్లీ డీసీపీ ఆర్పీ మీనా వెల్లడించారు.

# నూతన ఆకృతి పొందిన మెక్‌డోవెల్ నెంబర్ 1ను కలుసుకోండి



**విశాఖపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 14:** తరువాత తరపు ఔత్సాహికులకు ప్రాధాన్యతా పానీయంగా విస్కీని మార్చడమే లక్ష్యంగా పూర్తిస్థాయిలో బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నట్లు, పరిమాణం పరంగా దేశంలో అత్యధికంగా విక్రయించబడుతున్న విస్కీ మెక్‌డోవెల్ నెంబర్ 1ను విస్కీ వెల్లడించింది. ఈ నూతన విధానం నూతన లోగో యూనిట్‌ను కలిగి ఉండటంతో పాటుగా మెరుగైన సమతుల్యత కలిగిన విస్కీ మరియు స్థిరమైన ప్యాకేజింగ్‌ను కలిగి ఉంటుంది. 1968లో ఈ బ్రాండ్ ఆవిష్కరించబడిన తరువాత అతి పెద్ద మార్పుగా ఇది నిలుస్తుంది. ఈ నూతన ప్యాక్‌ను మెక్‌డోవెల్ నెంబర్ 1ను బ్రాండ్‌ను ఆధునీకరించడాన్ని లక్ష్యంగా చేసుకున్నారు, ఈ నూతన లోగో రూపకల్పనలో ముఖ్యమైన భాగం ఆలింగనం – ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది స్నేహితులు/యార్స్ కలుసుకున్నప్పుడు ఆలింగనంను పోలి ఉంటుంది . ఇది స్నేహాన్ని పెంపొందించడంలో బ్రాండ్ యొక్క నిబద్ధతను వ్యక్తిగతీకరిస్తుంది. స్నేహం పట్ల బ్రాండ్ యొక్క సిద్ధాంతాన్ని, పూర్తి సరికొత్త, నూతన తెరుచుకున్న ఆలింగనపు లోగో యూనిట్‌లో అత్యంత అందంగా చెక్కారు. ఇది నేటి తరపు అన్నిసంస్కృతులకూ తెరిచి ఉంచబడింది అనే సిద్ధాంతాన్నీ నిర్వచిస్తుంది. ఈ తాజా మార్పులను గురించి అమర్ ప్రీత్ ఆనంద్, ఈవీపీ మార్కెటింగ్ అండ్ పోర్ట్‌ఫోలియో హెడ్, డియాజియో ఇండియా మాట్లాడుతూ “అన్ని సందర్భాలలోనూ స్నేహాన్ని ప్రారంభించే వానిగా 1968 నుంచి ఏకధాటిగా తమ ప్రయాణాన్ని మెక్‌డోవెల్ నెంబర్ 1ను చేస్తూనే ఉంది. రెండు వైవిధ్యమైన రకాలు –అత్యుత్తమ సమతుల్యత కోసం నెంబర్ 1 ఒరిజినల్ మరియు అత్యంత మృదువైన నెంబర్ 1 కోసం నెంబర్ 1 లగ్జరీని తీసుకురావడం పట్ల మేము చాలా ఆనందంగా ఉన్నాము. ఈ నూతన బాటిల్ మరియు ప్యాకేజింగ్ సమ్మేళనంతో, ఈ ప్రతిష్టాత్మక బ్రాండ్ ఇప్పుడు మరింత సమకాలీనత మరియు ప్రీమియం విభాగంలోకి దూసుకుపోతుందని భావిస్తున్నాం. మీరిప్పటికే అభిమానిస్తున్న విస్కీ నూతన మెక్‌డోవెల్ నెంబర్ 1ను మరియు తరువాత సారి తాము వేడుక చేసుకోవాలనుకున్నప్పుడు మా వినియోగదారులు ఒరిజినల్, లగ్జరీని ఎంచుకుంటారని మేము ఎదురుచూస్తున్నాము” అని అన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, హనుమాన్ జంక్షన్



పశ్చిమ కృష్ణా జిల్లాల సరిహద్దు ప్రాంతమైన హనుమాన్ జంక్షన్ లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నాలుగు రోడ్ల కూడలి లో ఉంది. స్వామి వారి విగ్రాహ స్థాపన ముందు ఈ ప్రాంతాన్నిబాపుల పాడు, అప్పన వీడు, ఏపూరు జంక్షన్ అని పిలిచేవారు. విగ్రహ స్థాపన తో హనుమాన్ జంక్షన్ అయింది. దీనికొక చారిత్రిక నేపథ్యమూ ఉంది .నూజివీడు జమీందారు ఏం ఆర్ అప్పారావు గారి తండ్రి మేకా వెంకటాద్రి బహద్దర్అప్పారావు గారు శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని1938లో ప్రతిష్టచేశారు. దీని వెనుక ఒక ఫ్లాష్ బాక్ కూడా ఉంది. ఒక సారి మేకా వెంకటాద్రి అప్పారావు గారు ఈ ప్రాంతానికి వచ్చారు. అప్పుడు ఈ ప్రాంతం అంతా విపరీతమైన అడవులు, రాళ్ళ గుట్టలు ముళ్ళ పొదలు తప్ప ఏమీ లేవు. విపరీతం గా ఆకలి వేసింది. ఆహారం కోసం చుట్టుప్రక్కల అంతా వెతికారు దొరక లేదు... ఆకలి విపరీతమైనది. ఏం చేయాలో పాలు పోలేదు. ఇంతలో ఒక కోతి అక్కడికి వచ్చి రాజు గారి చేతిలో ఒక అరటి పండు పెట్టి అదృశ్యమైంది. ఆకలితో ఉన్న జమీందార్ గారు ఆ పండును తినేశారు. ఏంతో శక్తి వచ్చినట్లు అనిపించింది. జరిగిన అద్భుతాన్ని గుర్తుకు తెచ్చుకొని వానర రూపం లో వచ్చినది సాక్షాత్తు శ్రీ ఆంజనేయ స్వామి అని, ఈ ప్రాంతం పరమ పవిత్రమైందని గ్రహించారు. స్వామి వారి అనుగ్రహానికి ముగ్ధుడై జమీందార్ ఇక్కడ ఆంజనేయ స్వామిని ప్రతిష్టించి ఆలయ నిర్మాణం చేయాలని నిశ్చయించుకొన్నారు . భక్తుల పాలిటి కొంగు బంగారం అయిన స్వామి, తనకు అరటిపళ్ళ ప్రసాదం గా ఇచ్చిన స్వామిని చేతిలో అరటి పండ్ల గెల ఉండేట్లు నిలువెత్తు విగ్రహాన్ని నిర్మించి నాలుగు రోడ్ల జంక్షన్ లో ప్రతిష్టించారు. రోడ్డుకు ఎదురుగా శ్రీ రామాలయాన్ని కూడా నిర్మించారు. శ్రీరామునికి కుడి వైపు సీతా దేవి ఉండటంఇక్కడ మరో విశేషం. దీనికీ ఒక కదా ఉంది. త్రేతాయుగం లో సీతారాములు వనవాసానికి వెడుతూ ఇక్కడికి వచ్చారని, దారిలో వారికి ఆకలి అయిందని, వారి ఆకలి తీర్చటానికి హనుమ అరటి పళ్ళు తెస్తూ “రామా యివిగో అతటి పళ్ళు “అని పిలవటం తో సీతా దేవి వెనక్కి తిరిగిందట అందుకే రాముడికి కుడి వైపున నిలబడి ఉన్నట్లు ఉంటుంది. విగ్రహాన్ని చెక్కిన శిల్పి ప్రసిద్ధులైన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దండినీడు సన్యాసి లింగం గారు. స్వామి విగ్రహం సజీవం గా మహా ఆకర్షణీయం గా ముచ్చటగా ఉంటుంది. ఈ ప్రాంతం లో రోడ్డు ప్రమాదాలు జరుగ కుండా స్వామి కాపాడుతారు. శ్రీరామనవమికి రామాలయం లో శ్రీరామ కల్యాణం అత్యంత వైభవం గా నిర్వహిస్తారు. అందరికి భోజనాలు ఏర్పాటు చేస్తారు. హనుజ్జయంతి వారం రోజుల పాటు. మహోత్సవంగా చేస్తారు. జంక్షన్ లో ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా ముందు హనుమాన్ ను దర్శించి పనులు మొదలు పెట్టటం ఆచారం. హనుమాన్ విగ్రహం పశ్చిమ గోదావరి లోను, దేవాలయం మెట్లు కృష్ణా జిల్లాలోను ఉండటం ఇక్కడ వింత.



# విశాఖపట్నం వార్తలు

## విశాఖ రిఫైనరీలో మాక్ డ్రిల్





**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 14:** హెచ్ పీసీఎల్‌కు చెందిన విశాఖ రిఫైనరీలో ఈనెల 12వ తేదీ రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆ వివరాలు.... రాత్రి 10.40 గంటలకు సంస్థ డీహెచ్‌డీఎస్ ఆ విభాగంలో హైడ్రోజన్ సల్ఫేట్ వాయువు లీకైంది. వెంటనే సైరన్ మోగించి అన్ని విభాగాల సిబ్బం దిని అప్రమత్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి... అస్వస్థతకు గురైన ఉద్యోగులను ఆసుపత్రికి తరలించే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ మాక్ డ్రిలను జాయింట్ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి, రిఫైనరీ – ఈడీ వి.రతన్ రాజు, వీఆర్ఎంపీఎల్ ఈడీ పి. వీరభద్రరావు, సీజీఎం(ఇన్‌ఛార్జి) రామకృష్ణన్, ఎన్. రాజరావు, ఎం.కాళీ పర్యవేక్షించారు.

## గ్రామ/వార్డు సచివాలయాల పరీక్ష ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 14:** గ్రామ/వార్డు సచివాలయాల పరీక్ష ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు వి. వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. గ్రామ/వార్డు సచివాలయాల పరీక్షలు ఈ నెల 20 తేదీ నుండి 26 వ తేదీ వరకు జరుగనున్న పరీక్షలకు సంబంధించి పరీక్ష మెటీరియల్స్ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలలో భద్రత పరచిన రూంలను ఆయన సోమవారం అధికారులతో సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ లన్నింటిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముందుగానే అన్నింటినీ ప్రిపేర్ చేసుకోవాలని జిల్లా పరిషత్ సిఇఓ ను ఆదేశించారు. స్టేషనరీ, పరీక్ష మెటీరియల్ ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరాలని డిఆర్డిఎ ప్రాజెక్టు అధికారి విశ్వేశ్వరరావును ఆదేశించారు. సిబ్బంది అవసరమైతే తెలియజేయాలన్నారు. యువకులైన సీనియర్ అసిస్టెంట్ కేడర్ గల సిబ్బందినే నియమించుకోవాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం స్టేడియం లోపల, బయట ఉండాలన్నారు. శానిటరీ, తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల ఇన్ చార్జ్ లకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేసినపుడు రశీదు తీసుకోవాలని ఆదేశించారు. స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంకు మెటీరియల్ కు వచ్చే వాహనాల ట్రాఫిక్ లేకుండా చూడాలని యుసిడి పిడి శ్రీనివాసరావు ను ఆదేశించారు. డ్రైవర్లను ముందుగానే పరిశీలించుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. బయట సైనేజస్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేషనరీకి ఒక రూం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. పోలీసు బందోబస్తు ఏర్పాటుకు పోలీసు అధికారులతో మాట్లాడాలని డిఆర్డిఏ పిడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ జి. సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్ – 2 పి. అరుణ్ బాబు, డిఆర్ఓ ఎ. ప్రసాద్, డిఆర్డిఏ పిడి విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో నాగార్జున సాగర్, అనకాపల్లి ఆర్డీవో సీతారామారావు, జివిఎంసి అధికారులు, రవాణా శాఖ అధికారులు, ఆర్టీసి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్.రాజశేఖరరెడ్డి గారు తనయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి. జగన్ మోహన్ రెడ్డి గారు ఈరోజు ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా మహిళసంఘాల మహిళలకు ఋణమాఫీ చేయుటలో భాగముగా ఆసరా సంకల్పించినారు ఇందులకు గాను మా 29 వ వార్డ్ కు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులు యావన్మంది సంయుక్తముగా ముక్త ఖంఠము తో హర్షం వెలిబుచ్చినారు పిదప జగన్మోహన్ రెడ్డి గారు చిత్ర పటం నాకు పాలభిషేకం గావించినారు పై కార్యక్రమంలో వార్డులో మొత్తం 6 సచివాలయల సిబ్బంది,వాలంటరీస్,ంనాగమణిగారు రత్నం తదితరులు పాల్గొన్నారు ఈయొక్క కార్యక్రమం నాకు ముఖ్య అతిధిగా జోన్ 3 కమిషనర్ సన్యాసినాయుడు గారు పాల్గొన్నారు. 29 వ వార్డ్ కార్పొరేటర్ వురికిటి నారాయణరావు కార్యక్రమమును ఉద్దేశించి మాట్లాడుతు .ఆసరా కార్యక్రమము విజయవంతంనకు శ్రమించిన 29.వ వార్డు పరిధిలో ఉన్న 6 సచివాలయం సిబ్బందికి, వార్డు వాలంటీర్లకు, శ్రీమతి.నాగమణి రత్నం గారికి లకు మరియు లకు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు కండిపల్లి సతీష్ కుమార్ ,చోల్లంగి శేఖర్, పల్లా రాదలక్ష్మి, సారిపల్లి వెంకు,బొండడ వెంకట్రావు, అరుగుల రాజు, ఒమ్మి కిషోర్, ముప్పర్తి శేఖర్, .మూర్తి బుల్లెట్ రవి, మరియు కార్యకర్తలు వార్డ్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– వార్తావళి, విశాఖ దక్షిణం

## ఘనంగా 'వైయస్ఆర్ ఆసరా వారోత్సవాలు"



**పెందుర్తి, వార్తావళి, సెప్టెంబర్ 14:** విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలోని సుజాత నగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నాడు "వైయస్ఆర్ ఆసరా వారోత్సవాలు" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళా స్వయం సహాయక సంఘాల చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. పెందుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 2,314 సంఘాలకు 23,814 సభ్యులున్నారని, మొదటివిడతగా 15 కోట్ల రూపాయలు విడుదలైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడం తో పాటు మరెన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ద్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. అంతేకాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని అన్నారు. ఏ ప్రభుత్వం ఇవ్వనంతగాఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలోగా కోవిడ్-19కి వ్యాక్సిన్



వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలోగా కోవిడ్–19కి వ్యాక్సిన్ వస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఆదివారం సోషల్ మీడియాలో 'సండే సంవాద్' కార్యక్రమంలో తన ఫాలోవర్లతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన ఆయన.. వ్యాక్సిన్ భద్రతపై ఎవరికీ సందేహాలు, ఆందోళనలు లేకుండా, తానే మొదటి డోసు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ ప్రయోగాలకు డీసీజీఐ అనుమతులు ఇచ్చాకే సీరమ్ ఇనిస్టిట్యూట్ భారత్‌లో ప్రయోగాలు ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారుఇక కరోనా వైరస్ వస్తే అత్యవసరమైన వారికే ముందుగా ఇస్తామని హర్షవర్ధన్ వివరించారు. సీనియర్ సిటిజన్లు, ఫ్రంట్ లైన్ వర్కర్లకు తొలి ప్రాధాన్యత ఇస్తామని., ఆర్థికంగా వారికి టీకా కొనుగోలు చేసే శక్తి లేకపోయినా వారికే ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. వ్యాక్సిన్ భద్రత, నాణ్యత, ధర, ఉత్పత్తి, సరఫరా ఇలా అన్ని విషయాల్లోనూ ఇప్పటికే విస్తృత స్థాయిలో చర్చలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఇక మార్కెట్‌లోని రెమిడెసిమర్ వంటి మందుల విషయంలో అక్రమ దందా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకునేలా ఔషధ నియంత్రణ మండలికి సూచించినట్లు మంత్రి వివరించారు

## మాస్కులు,శానిటైజెర్ల పంపిణీ



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 14:** భారత ప్రధాని నరేంద్ర మోడీ 70 వ జన్మ దినోత్సవము సందర్భంగా భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం మరియు బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో సేవసప్తాహ ప్రారంభ కార్యక్రమము ఈరోజు జరిగినది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాధవ్ కేజీహెచ్ దరి శ్రీ గాయత్రి వీధి విక్రయదారుల కు 70 మందికి మాస్కులు,శానిటైజెర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ప్రపంచనేతగా భారత ప్రధాని మోడీ గుర్తింప పడ్డారని మౌళిక వసతుల రూపకల్పనలో ప్రజలకు చేరువ అయ్యారని, మరుగుదొడ్ల నిర్మాణం,ఇంటింటికి మంచినీరు కుళాయి కనెక్షన్స్ ప్రతి గ్రామంలో సి.సి రోడ్ల నిర్మాణము పేద మహిళలకు జన్ –ధన్ ఖాతాలు,చిరు వ్యాపారస్తులకు ముద్ర ఋణములు,కరోనా లాక్డౌన్ సమయంలో చిరు వ్యాపారస్తులకు అండగా ఆత్మ నిర్భర్ భారత్ పథకంలో భాగంగాస్వానిధి ద్వారా పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవి కుమార్, బీజేపీ అభ్యర్థి పల్లా చలపతిరావు,సీహెచ్ రాజబాబు,ఓ.ఆల్బర్ట్, సీహెచ్ రాంబాబు,గేదెల శ్రీహరి,కే.సత్తిబాబు,కే రామ్ కుమార్,అప్పల నాయుడు,ఎస్కే వల్లి,శారద,మంజు, సన్యాసమ్మ అధిక సంఖ్యలో వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభావంతులకు అభినందనలు



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నగరానికి చెందిన ఆకాష్ ఇనిస్టిట్యూట్ కు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభావంతులు గా నిలిచారు . ఈ మేరకు రాష్ట్రంలో 38 మందికి ఉత్తమ ఫలితాలు తమ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు లభించినట్టు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ( ఏఈఎల్ ) ఏ పి స్టేట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ వి ఎస్ మూర్తి తెలిపారు . విశాఖ సెంటర్ కి సంబంధించి గాజువాకకు చెందిన డి . ధరణి 99.87 % మార్కులు , రిపుంజయ్ ద్వివేదీ 99.03 % సాధించారన్నారు . వీరితో పాటూ దివ్య శర్మ 98.00 , వంశీకృష్ణ జగిలింకి 97.69 , దుర్గా సాయి దిలీప్ కోన 97.65 , వాన ఫాల్గుణ కృష్ణదాస్ 96,89 , నితీష్ తివారీ 96.36 మొత్తం 38 మంది జెఈఈ మెయిన్స్ 2020 ప్రవేశ పరీక్షలో 95 % ఆ పైన మార్కులు సాధించారన్నారు . ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

## పోర్న్ సైట్స్ పై నిఘా.. అప్ లోడ్ చేస్తే జైలుకే?

పోర్న్.. ఇప్పుడు కేంద్రం ఎంత నిషేధించినా దీని వ్యాప్తి మాత్రం తగ్గడం లేదు. రోజురోజు దీన్ని చూస్తూ యువత చెడిపోతున్నారు. ఈ క్రమంలోనే దేశంలో మహిళలపై చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా కామాంధులు చెలరేగిపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అశ్లీల చిత్రాల వల్ల కూడా కొంతవరకు ప్రమాదం ఏర్పడుతోందని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పోర్న్ వీడియోలను దేశంలో నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎన్ని రకాలుగా పోర్న్ పై నిషేధం విధిస్తున్నా అవి ఆన్ లైన్లో అందుబాటులోకి వస్తూనే ఉంటున్నాయి. దీంతో కర్ణాటక పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పోర్న్ సైట్స్ లో అశ్లీల చిత్రాలు వీడియోలను అప్ లోడ్ చేస్తున్న వారిని పట్టుకోవడానికి గూగుల్ సహాయం తీసుకోనున్నారు. గూగుల్ సాయంతో సమాచారం సేకరించి కేంద్ర హోంశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ బృందాలు గూగుల్ ఇచ్చే ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితులను గుర్తిస్తారు. వారి సోషల్ మీడియా ఖాతాల ఆధారంగా నిందితులను పట్టుకోనున్నారు. ఇప్పటికే పట్టుకున్న వారిని కటకటాల్లోకి పంపుతామని స్పష్టం చేశారు.

## ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వం

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి



**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, సెప్టెంబర్ 14:** కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోడీ పాలన అన్ని విధాలా భ్రష్టు పట్టిందని,ప్రజలపై వివరీతమైన భారాలు మోపుతూ ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేస్తూ ప్రజల సంపదను కార్పోరేట్ వర్గాలకు దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన, సామాజిక న్యాయం, దళితులపై దాడులు,ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ తదితర డిమాండ్ల సాధనలో భాగంగా సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎమ్ పైడిరాజు,జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు ఎ విమల, చంద్రశేఖర్, లక్ష్మణ రావు, దేవుడమ్మ, వజ్రం, టి వి రావు, అప్పన్న, చిరంజీవి, రవి, అమర్, గణపతి, స్వామి, కాసుబాబు, సత్తిబాబు, కాసులరెడ్డి,నుకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శారదా పీఠాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాములు సందర్శన



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 14:** విశాఖ జిల్లా చిన్న ముషిడి వాడ గ్రామంలో ఉన్న శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాములను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివా సరావు, ప్రభుత్వ విప్ ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అదీప్ రాజ్ పలువురు దర్శించుకున్నారు. చాతుర్మాస్య దీక్ష ముగించుకుని ఆదివారం నాడు స్వరూపా నందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి విశాఖ శారదా పీఠానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అదీప్ రాజ్ స్వామిజీ ని కలసి ఆశీర్వాదం పొందారు. పీఠం సంప్రదాయం ప్రకారం మేళతాళాల మధ్య వేదపండితులు ఘన స్వాగతం పలికారు. పీఠంలో పీఠాధిపతి శ్రీ శ్రీ స్వరూపా నందేంద్ర సరస్వతి స్వామిజీని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్వామిజీతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం పీఠంలో వల్లిదేవసేన సహిత సుబ్రమణ్యస్వామి, మేధా దక్షిణ మూర్తి స్వామి వార్ల దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలను అందించారు.

## రాకాసి దోమల గుంపు.. వందలాది వన్యప్రాణులు బలి..



రాకాసి దోమల గుంపు వందలాది వన్య ప్రాణులను బలితీసుకుంది. ఇప్పటికే కరోన మహమ్మారితో అగ్రరాజ్యం వణికిపోతుండగా.. తాజాగా రాకాసి దోమల గుంపు ఆ దేశంపై దండెత్తింది. రాకాసి దోమల గుంపు వందల సంఖ్యలో పాడి జంతువుల్ని, వణ్య ప్రాణుల్ని బలితీసుకుంది. లూసియానాలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గత నెల 27న హరికేన్ లారా కారణంగా పెద్ద సంఖ్యలో రాకాసి దోమలు లూసియానాలోకి వచ్చిపడ్డాయి. ఈ రాకాసి దోమల దాడిలో 400 పాడి జంతువులు, 30 జింకలు మృత్యువాతపడ్డాయి. దీంతో ఆ జంతువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా లక్ష డాలర్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు హెలికాప్టర్ల సాయంతో దోమల మందును పిచికారీ చేశారు. దీంతో దోమల ఉధృతి కాస్త తగ్గింది. రాకాసి దోమలు గుంపులుగా వచ్చి గేదెలు, ఆవులు, గుర్రాలు, జింకలపై దాడి చేశాయి. వాటి రక్తాన్ని పీల్చి చంపేశాయని.. దీంతో అవి ప్రాణాలు కోల్పోయానని అధికారులు తెలిపారు.

## పాము కాటుకు ఇద్దరు కవల పిల్లలు మృతి..



పాము కాటుకు ఇద్దరు కవల పిల్లలు మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లోగల మర్ద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఛోట్నామర్ద్ గ్రామంలో కవలలు మృతి చెందారు. ఈ బాలికల మృతి స్థానికంగా సంచలనం రేపింది. వారి మృతికి కారణం తెలియగానే అక్కడున్నవారంతా హతాశు లైపోయారు. వివరాల్లోకి వెళితే.. కవలలు తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఏడుస్తుండగా, తండ్రి వారిద్దరికీ గ్లాసుతో పాలు పట్టించాడు. పాలు తాగిన కొద్దిసేపటికే ఆ చిన్నారులిద్దరి నోటి నుంచి నురగలు రాసాగాయి. విషయం తెలియగానే చుట్టుపక్కల వారంతా బాధిత చిన్నారుల ఇంటికి వచ్చారు. వారంతా ఇంటిలోని నలుమూలలా చూడగా, ఒక పాము కప్పను మింగుతూ కనిపించింది. దీంతో ఆ పాము పాలను తాగి ఉంటుందని, ఆ పాలనే చిన్నారులు తాగి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే వారు ఆ బాలికలను ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు బాలికలు మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006